నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | డిసెంబర్ 14, 2024 | www.navatelangana.com

అసైన్డ్ భూమిని పట్టాలుగా మార్చిన తహసీల్దార్‌లపై ఏసీబీ దాడులు నిర్వహించాలి

- ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నవారిని గుర్తించండి
- సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్

నవతెలంగాణ-కామారెడ్డి



అసైన్‌మెంట్ భూములను పట్టా భూములుగా మార్చిన తహసీల్దార్‌లపై ఏసీబీ అధికారులు దాడులు చేసి చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్టీ ఆధ్వర్యంలో గడపగడపనకు సీపీఐ(ఎం) చేసిన ప్రచారంలో భాగంగా తమ దృష్టికి చాలా విషయాలు వచ్చాయని తెలిపారు.

వివరాలు మెయిన్‌లో..

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన.. బంధువుల దాడిలో వ్యక్తి మృతి

- వీరన్నగుట్టతండాలో ఉద్రిక్తత..
- పోలీసు బలగాల మొహరింపు

నవతెలంగాణ-రెంజల్





బాలికపై అసభ్యంగా ప్రవర్తించాడనే నెపంతో ఓ వ్యక్తిపై స్థానికులు దాడి చేయగా.. సదరు వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం వీరన్నగుట్ట తండాలో చోటుచేసుకుంది. కాగా తండాలో ఉద్రిక్తత వాతావరణం నెలకొనడంతో పోలీసు బందోబస్తు చేపట్టారు. స్థానికుల వివరాల ప్రకారం.. తండాలోని కిరాణా దుకాణం నడిపిస్తున్న రెడ్యా నాయక్ (50) ఎనిమిది సంవత్సరాల బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించాడని బాలిక కుటుంబీకులు మృతుడి పై గురువారం రాత్రి దాడి చేశారు.

వివరాలు మెయిన్‌లో..

నిజాంసాగర్, ఎస్సారెస్పీ చారిత్రక కట్టడాలు



నిజాంసాగర్ నీటికి పూజలు చేస్తున్న మంత్రి

- రెగ్యులర్ మెయింటేనెన్స్‌కు నిధులు విడుదల చేస్తాం
- కాలువలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తాం
- గత పాలకులు నిర్లక్ష్యం వహించారు
- నీటిపారుదల, సివిల్‌సప్లయ్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- నిజాంసాగర్ నుంచి యాసంగికి సాగునీటి విడుదల
- ఎస్సారెస్పీని సందర్శించి ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి రివ్యూ

నవతెలంగాణ-నిజాంసాగర్/మెండోరా

నిజాంసాగర్, ఎస్సారెస్పీ చారిత్రక కట్టడాలని వాటి రెగ్యూలర్ మెయింటేనెన్స్‌కు నిధులు మంజూరు చేస్తామని నీటిపారుదల, సివిల్ సప్లయ్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కాలువల మరమ్మతులు చేయిస్తామని, అదే విధంగా ఎస్సారెస్పీ పూడికతీత పనులు చేయిస్తామని వెల్లడించారు. మంత్రి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో శుక్రవారం పర్యటించారు. ముందుగా కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ నుంచి యాసంగి సాగుకు తొలి విడుత నీటిని మాజీ మంత్రి, బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌తో కలిసి ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా విడుదల చేశారు. అనంతరం నిజామాబాద్ జిల్లా మెండోరా మండలంలోని ఎస్సారెస్పీ ప్రాజెక్టును సందర్శించారు. సాగునీటి రంగంపై స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశానికి బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి , ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి.రాకేష్ రెడ్డి , బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి , నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి , జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావ్ హాజరయ్యారు. సమీక్ష సమావేశంలో బాల్కొండ ఎమ్మెల్యే వేముల.ప్రశాంత్ రెడ్డి ఇరిగేషన్ సమస్యల పైన వివరాలు తెలియజేసి సమస్యల పరిష్కారానికి ఉత్తంకుమార్ రెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాకు మేలు చేయాలని దృఢమైన సంకల్పంతో బీఆర్ఎస్, బిజెపి శాసనసభ సభ్యులతో కలిసి రివ్యూ సమావేశం నిర్వహించినట్టుతెలిపారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లా శాసనసభ్యులు అధికారులు విన్నవించిన ప్రకారం ప్యాకేజీ నెంబర్ 21, 22, 27 పనులు వేగవంతం చేసి తొందరగా పూర్తి చేయాలని సిఎం సెక్రటరీకి, ఈఎన్సి అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. రెగ్యులర్‌గా చేయవలసిన కాలువలు ఇతర ఇరిగేషన్ పనులు గత పది సంవత్సరాలుగా గత ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వహించాయని అన్నారు. ఇరిగేషన్ కాలువలు షెటర్లు లిఫ్ట్ గేట్లు చిన్న చిన్న పనులు మెయింటెనెన్స్ కింద చేపట్టాలని ఆదేశించారు. 112 టీఎంసీల నీటి నిల్వ ఉండే ఎస్సారెస్పీ ప్రాజెక్టు మట్టితో కూడుకుపోయి ఈరోజు 80 టీఎంసీలకు పడిపోయిందని అన్నారు. పూడిక తీత తీసే పనులు చేపడుతామని హామీ ఇచ్చారు.

రైతులు రబీ వరి సాగులో మొత్తం సన్న రకం వరిని వేయాలని అన్ని సన్న రకాల వడ్లకు 500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఇందులో రైతులు ఎటువంటి సందేహాన్ని పెట్టుకోవలసిన అవసరము లేదని అన్నారు.

వేముల ప్రశాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఇరిగేషన్ డిపార్మెంట్ కు సంబంధించిన సమస్యలను మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డికి విన్నవించానని తెలిపారు. గత ప్రభుత్వం చేపట్టిన ఇరిగేషన్ కాలువ పనులను పూర్తి చేసి పంటలకు సాగునీరు అందేలా రైతులకు మేలు చేయాలని కోరారు.రాజకీయ కోణంలో ఆలోచింపక రైతుల మేలుకొరకు పనులు పూర్తి చేయాలని మంత్రికి ఆదేశించామని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి పనులు పూర్తిచేసి రైతుల పక్షపాతిగా నిలుస్తారని ఆశిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి రెవెన్యూ అధికారులు , ఇరిగేషన్ అధికారులు , ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అంతకుముందు నిజాంసాగర్‌లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నిజాంసాగర్ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ నుండి అలీసాగర్ వరకు యాసంగి పంట సాగు కోసం నీటిని విడుదల చేసినట్టు తెలిపారు. రైతులందరూ అప్రమత్తంగా ఉండి నీరు వృథా చేయకుండా నీటిని వినియోగించుకోవాలని తెలిపారు. అలీసాగర్ వరకు 1,30,000 ఎకరాలకు సాగునీరు అందిస్తు న్నామని మొత్తం 10 మండలాల్లో మూడు నియోజకవర్గాల్లో రైతులకు పంటలు పండుతాయని అన్నారు. తెలంగాణలోనే మొదటగా నిజంసాగర్ ప్రాజెక్టు కింద రైతులు నారుమడులు వేసి పంటలు పండిస్తారని ఆ పంటలను వడగండ్ల వాన పడకముందే వరి పంటలన్ని పూర్తి అవుతాయని ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ నిజాంసాగర్ ప్రాజెక్ట్ జుక్కల్ నియోజకవర్గంలో ఉన్నప్పటికీ కేవలం 3600 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుందని ఆయన అన్నారు. నాగమడుగు లెండి ప్రాజెక్టులు పూర్తిచేస్తే జుక్కల్ నియోజకవర్గం మొత్తం సస్యశ్యామలమవుతుందని ఆయన మంత్రికి విజ్ఞప్తి చేశారు. కౌలస్ ప్రాజెక్ట్ నిర్మించిన నాటి నుంచి నేటి వరకు నిర్వహణ లేక కాలువలలో చెట్లు ముళ్లపదలతో పూడికపోయిందని ఆయన తెలిపారు. కాల్వలలో పూడికలు తీసి మరమ్మత్తులు చేపట్టాలని మంత్రిని ఆయన కోరారు. కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంఘ్వన్, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ కామారెడ్డి టి.శ్రీనివాస్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, పిట్లం ఏఎంసీ చైర్మన్ చికోటి మనోజ్, ఉమ్మడి మండల అధ్యక్షులు మల్లికార్జున్, రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎస్సారెస్పీపై సమీక్షిస్తున్న మంత్రి

సాగుకు సరిపడా నీరు

- కాంగ్రెస్ ఉన్నంత వరకు సన్నవడ్లకు బోనస్
- తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరందేలా ప్రణాళిక
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వివరాలు మెయిన్‌లో..

బీడీ ప్యాకర్స్ దేశాయి కార్మికులు బీఎల్‌టీయూ నుంచి సీఐటీయులో చేరిక



సీఐటీయూలో చేరిన బీడీ ప్యాకర్స్ కార్మికులు

నవతెలంగాణ-నందిపేట్(నిజామాబాద్)

నందిపేట్ మండలం దేశాయి బీడీ ప్యాకర్స్ కార్మికులు బీఎల్‌టీయూ నుంచి సీఐటీయూలో చేరినట్టు సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ తెలిపారు. కార్మికులకు సీఐటీయూ కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో బీడీ పరిశ్రవలో పనిచేయు కార్మికుల సమస్యలపై తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాజీలేని పోరాటం చేయడం ద్వారా బీడీ ప్యాకర్స్ యూనియన్ పోరాటాలతో ఆకర్షితులై యూనియన్‌లో చేరినట్టు తెలిపారు. బీడీ యజమాన్యం నుండి ఎలాంటి సమస్యలు వచ్చినా కార్మికుల పక్షంలో ఉండి పోరాడే సంఘం కేవలం సీఐటీయూ అని అన్నారు. నిరంతరం ప్రజల సమస్యలు కార్మికుల సమస్యలపై సిఐటియు రాజీలేని పోరాటాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో బీడీ పరిశ్రమలో పనిచేసే కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. కార్మికులు మహబూబ్, నవీన్, భూమయ్య, రఫీక్, సయ్యద్ పాష, ఏ సాగర్, దత్తాత్రి, సిహెచ్ గోవర్ధన్, డి ప్రసాద్, టి గంగాసాయిలు, డి నవీన్. రుక్మన్న, వి సాయిలు ,బి భూమయ్య, నరసయ్య తదితరులు సీఐటీయూ చేరినట్టు తెలిపారు.

బతుకమ్మ.. మా బతుకులు మార్చు

- రోడ్డుపై బతుకమ్మ ఆడుతూ సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-కామారెడ్డి



బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి నాలుగవ రోజుకు చేరింది. బతుకమ్మ.. నువ్వైనా ప్రభుత్వం మనసు కరిగించి తమ బతుకులు మార్చేలా నిర్ణయం తీసుకునేట్టుచూడు తల్లీ అంటూ బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని తమని రెగ్యులర్ చేయాలని అప్పటివరకు వెంటనే పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో బోధించే ఉపాధ్యాయులే తమ సమస్యల సాధనకై రోడ్డుమీద ఎక్కి బతకమ్మలు ఆడుతున్న మహిళల పట్ల నీ చిత్తశుద్ధిని నిలబెట్టుకోలేని ముఖ్యమంత్రి రేవంత్ అని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థి సంఘాల నాయకులు పూర్తి మద్దతు తెలుపుతూ విద్యార్థులకు విద్య నేర్పి ఉపాధ్యాయులు రోడ్ల ఎక్కడం బాధాకరమని సమస్యలు పరిష్కారం కాకుంటే విద్యార్థి సంఘాలు మద్దతిస్తూ విద్యార్థులతో సహ మీ వెంట ఉంటామని తెలిపారన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా డిటిఎఫ్ బాధ్యులు విజయరామరాజు, బివిఎం రాష్ట్ర నాయకులు విట్టల్, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సి ఐ టి యు జిల్లా బాధ్యులు ఎస్ వెంకట్ గౌడ్, ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొత్త నరసింహులు, సురేష్ గొండా, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షురాలు వాసంతి, హరిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మోసం చేయొద్దు

- న్యాయబద్ధంగా పత్తి కొనాలి
- మిల్లులను సందర్శించిన కలెక్టర్.. కొనుగోళ్లపై ఆరా

నవతెలంగాణ-మద్నూర్

పత్తి రైతులకు ఎలాంటి అన్యాయం జరగకూడదని న్యాయబద్ధంగా కొనుగోలు జరగాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం మద్నూరు మార్కెట్ పరిధిలో పత్తి కొనుగోలు జరిపే పత్తి మిల్లును సందర్శించారు. కొనుగోలు తీరుపై సిసిఐ అధికారి ఓబుల్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడారు. మార్కెట్ కమిటీ అధికారులు పత్తి కొనుగోలు పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రమ్య కు అలాగే మద్నూర్ మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్‌నాథ్‌కు సూచించారు. పత్తి కొనుగోళ్ల గురించి పత్తి బేళ్ల తయారు గురించి పత్తి పరిశ్రమను సందర్శించి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ పత్తి కొనుగోళ్లపై ఆరా తీయడంతో అధికారుల్లో పత్తి వ్యాపారులు హడలెత్తిపోయారు. కలెక్టర్ వెంట బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రమ్య మద్దూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సౌజన్య రమేష్ మద్నూర్ తహసీల్దార్‌లు ఎండి ముజీబ్ మండల ప్రత్యేక అధికారి నాగరాజ్ ఎంపీడీవో రాణి ఎంపీ ఓ వెంకట నరసయ్య ఆర్ఐ శంకర్ మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్‌నాథ్, సిసిఐ అధికారి ఓబుల్ రెడ్డి పత్తి మిల్లు యజమాని రాజేష్ కాకాని వివిధ శాఖల అధికారులు రైతులు పాల్గొన్నారు.



పత్తికొనుగోలుపై ఆరా తీస్తున్న కలెక్టర్

లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కమిషనర్‌గా కె విజయ సారథి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కమిషనర్ గా కె విజయ సారథి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్‌తో పాటు నిజామాబాద్‌కు అదనపు బాధ్యతలు స్వీకరించారు. తూనికలు కొలతల విభాగంలో ఎటువంటి సమస్యలు ఏర్పడిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న విజయసారథి

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- ఐటీఐ కళాశాలను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-బిచ్కుంద



బిచ్కుంద ఐటీఐ కళాశాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను వేగవంతంగా నిర్మాణం చేసి పనులు పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం యువత కోసం అనేక ట్రేడ్స్ ను ప్రవేశ పెట్టిందని, మంచిగా చదువుకొని ఉపాధి అవకాశాలను సంపాదించుకోవాలని సూచించారు. అంతకుముందు మండలంలోని ఫత్లాపూర్‌లో నిర్వహిస్తున్న సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులకు ఇళ్ల ఉన్నాయో లేదో పరిశీలించి ఇందిరమ్మ ఇళ్ల సర్వే ను పక్కాగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాన్స్‌వాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ గోపాల కృష్ణ, మండల స్పెషల్ ఆఫీసర్ నగేష్, ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్, తదితరులు ఉన్నారు.

కల్తీకల్లు జోరు



- ఇష్టానుసారంగా రసాయనాలతో తయారీ..?
- ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో కల్తీకల్లు మాఫియా రెచ్చిపోతున్నారు. ఇష్టానుసారంగా రసాయనాలతో కల్లు తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడు తున్నారు. స్పెషల్ కల్లు పేరుతో ఎక్కడికక్కడ విచ్చలవిడిగా విక్రయాలు చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టన ట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమ వుతున్నాయి.

పొద్దంతా పనిచేసి కాస్త అలసిన శరీరానికి విశ్రాంతి కొరకు గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు పాతకాలంలో ఈత చెట్టు, తాటి చెట్టు, నుంచి వచ్చేసహజమైన కల్లును సేవించి విశ్రాంతి పొందేవారు. అలా అలా కాలం మారుతున్న కొద్దీ దళారుల పుణ్యమా వారి కాసుల పంట కొరకు కల్తీకల్లుతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. అనడంలో సందేహం లేదు. కల్తీ కల్లు విక్రయిస్తూ అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇది కల్లు కాదు కాటికి పంపే రసాయనం అని తెలియక చాలా మందికి ఈ కల్తీ కల్లుకు అలవాటు పడి అనారో గ్యానికి గురవుతుండగా ఈ కల్తీ కల్లు వల్ల గతంలో పలువురు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి.

మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో కల్తీ కల్లు ఏరులై పారుతోంది. అదే విధంగా మండలంలోని చిన్న పోతంగల్, రాంపూర్ గడ్డ, పెద్ద పోతంగల్, మొండి సడక్, గౌరారం, గండిపేట్, జువ్వడి, బూర్గుల్, జనగామ తదితర గ్రామాల్లో కల్తీ కల్లు జోరుగా కొనసాగుతోంది.

అమాయకుల ప్రాణాలతో చెలగాటం..

కల్తీ కల్లు విక్రయిస్తూ అమాయకుల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు కొంత మంది వ్యాపారులు. కార్మికులు, కూలీల కడు పులు కొడుతూ అడ్డంగా సంపాదిస్తు న్నారు. వింత మత్తును అల వాటు చేసి వారి కుటుం బాలను వీధిన పడేస్తున్నారు. ఒల్లు గుల్ల చేసి ఆస్పత్రుల చుట్టూ తిప్పిస్తున్నారు. రాజకీయ నాయకులు, అధికారుల అండదండ లతో కేసుల నుంచి తప్పించుకొని దర్జాగా తిరుగుతు న్నారు. ఇంత జరుగుతున్నా ఏ నాయకుడు పట్టించుకోడు. ఏ అధికారి తనిఖీలు నిర్వహించరు.

మత్తుకోసం రసాయనాలు

వ్యాపారులు మత్తు కోసం ఇందులో రకరకాల రసాయనాలు కలుపుతున్నట్టు సమాచారం. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. 10 లీటర్ల స్వచ్ఛమైన కల్లుకు 500 లీటర్ల నీళ్లు, మత్తు కోసం ఆల్ఫ్రోజోలం, డైజోఫాం, క్లోరో హైడ్రెడ్ తదితర నిషేధిత మత్తు రసాయనాలు కలుపుతున్నారు.

దెబ్బతింటున్న ప్రజల ఆరోగ్యం

అమ్మోనియం మిశ్రమ రసాయనాలు, సోడా యాష్, ఈస్ట్, పంటలకు వాడే యూరియా, కొన్ని రకాల పెస్టిసైడ్‌ను కూడా వాడుతున్నారు. అదేవిధంగా కుంకుడుకాయ రసం వాడుతున్నారు. దీనివల్ల నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది.కళ్లు పోవడం, మెదడు సరిగ్గా పనిచేయకపోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, మూత్రపిండాల వ్యాధులు, జీర్ణకోశ సంబంధిత వ్యాధులు ప్రాణాలు సైతం పోతున్న ఘటనలు సంభవిస్తున్నాయి.

యువత పెడదారి

ఈ రోజుల్లో యువతకు చేతుల్లో సెల్ఫోన్, జల్సాకు బైక్, ఆ పార్టీలు ఈ పార్టీలు అంటూ జోరుగా దావతులు చేసుకోవడానికి ఆలోచిస్తున్న తరుణం ఇలాంటి యువత కల్తీ కళ్ళు మాఫియా వలన అలవాటు పడడంవలన సమాజం. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి, కల్తీ కల్లు నివారణకు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏంతైనా ఉంది. ప్రజల శ్రేయస్సు కోరి సంబంధిత అధికారులు, చొరవ చూపి ఇలాంటి కల్తీ కళ్ళు స్థావరాలపై దాడులు జరిపి కల్తీ కల్లు అంతం అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సర్వేలతో సతమతం

- తీవ్ర పనిభారం పడుతోందని వాపోతున్న జీపీ కార్యదర్శులు
- ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేయబోమంటూ ఉన్నతాధికారులకు విన్నపాలు
- సర్వేలకు ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని, వివరాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని వాపోతున్న వైనం

నవతెలంగాణ-వర్ని



ఒక వైపు సర్పంచ్‌లు లేరు. మరో వైపు ప్రత్యేకాధికారులు తమ శాఖ పనిలో బిజీగా ఉంటున్నారు. దీంతో గ్రామాల్లో సర్పంచ్‌లు లేని లోటు భర్తీ చేసేందుకు తమ వంతు పాత్ర పోషిస్తున్నారు గ్రామపంచాయతీ కార్యదర్శులు. నీటి సమస్య, వీధి లైట్‌లు, పారిశుధ్యం, సర్టిఫికేట్‌ల మంజూరు, ట్యాక్స్‌ల వసూలు ఒక వైపు చేపడుతూనే మరోవైపు ప్రభుత్వం పిలుపునిచ్చే కార్యక్రమాలను గ్రామాల్లో వారు ముందుండి నిర్వహిస్తున్నారు. ఒక వైపు బిల్లులు రాకున్నా.. తమ సొంత నిధులతో గ్రామాల్లో పలు కనీస సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇదంతా ఒకత్తు అయితే.. సర్వేల పేరుతో అదనపు పని భారం మోపుతున్నారని కార్యదర్శులు వాపోతున్నారు. మొన్నటి వరకు కులగణన సర్వే చేపట్టగా.. తాజాగా ఇందిరమ్మ ఇండ్ల సర్వేతో తమపై తీవ్ర భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 545 గ్రామపంచాయతీలున్నాయి. కాగా సర్పంచ్‌ల పదవి కాలం ముగిసి పది నెలలు పూర్తయినా గ్రామ పంచాయతీల్లో సమస్యలు రాకుండా చూడటంలో జీపీ కార్యదర్శులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. జీపీలకు నిధులు రాకపోవడంతో.. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో సౌకర్యాలు మెరుగు పర్చడంలో భాగంగా తమ సొంత జీతం డబ్బులు సైతం వెచ్చిస్తున్నారు. మళ్లీ ప్రభుత్వం విడుదల చేసిన తర్వాత తీసుకుంటు న్నారు. నీటి, పారిశుద్యం, వీధి లైట్‌లు, సర్టిఫికేట్‌ల మంజూరు తదితర రోజువారీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కానీ ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమాలతో పని భారం పెంచటంతో కార్యదర్శులు గోస పడుతున్నారు. పని విషయంలో పతి ఉద్యోగికి పరిమితి ఉంటుంది. కానీ పంచాయతీ కార్యదర్శుల విధులకు మాత్రం లేకుండా పోతోందని వాపోతున్నారు.

సర్వేలతో సతమతం.. వివరాలు ఇవ్వని పలువురు

ప్రభుత్వం చేపట్టే సర్వేలతో కార్యదర్శులు అదనపు పనిభారంతో సతమతమవుతున్నారు. ఇది వరకే కులగణన కుటుంబ సర్వే చేపట్టారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు కోసం ప్రభుత్వం సర్వే ప్రారంభించింది. ప్రత్యేకంగా కేటాయించిన యాప్‌లో వివరాలు పొందుపరచాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న ప్రతిపేదవారి ఇంటికి వెళ్లి వారి వివరాలు యాప్‌లో ఎంట్రీ చేయటం తలకు మించిన భారంగా మారుతోందని వాపోతున్నారు. అయితే సర్వే సమయంలో పలువురు సహకరించకపోవడంతో చివాట్లు పెడుతున్నారని వాపోతున్నారు. పొలం పట్టా పాస్ బుక్‌లు అడుగటంతో ప్రజలు కోపానికి వస్తున్నారని, ఎందుకు పట్టా పాస్ బుక్ ఇవ్వాలనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఇంటికి పొలం పట్టాకు లింక్ ఏమిటని కొందరు కార్యదర్శిలతో వాగ్వాదానికి దిగుతున్నారు. ఇలాంటి పనులతో మధ్యాహ్నం లంచ్ చేసే సమయం కూడా పోతుందని సమాచారం.

ఆన్‌లైన్‌లో ఎంట్రీలతో పని చేసే సిబ్బందికి భోజనాలు కూడా పెట్టె పరిస్థితిలో లేకుండా పోయింది. కొందరు అనారోగ్యంతో ఉన్నా విధులకు హాజరు కావాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని, ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలని కోరుతున్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరంలో ప్రభుత్వ దుబ్బ హైస్కూల్లో విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో నీలం రామచంద్రయ్య భవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు ఏదైనా తప్పు చేస్తే మందలించాల్సింది పోయి చెయ్యి విరిగేలా కొట్టడం సరైనది కాదని అన్నారు. ఉపాధ్యాయురాలిని వెంటనే సస్పెండ్ చేయాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, ఇటువంటి ఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా విద్యాశాఖ అధికారులపైన ఉందని అన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ నాయకులు దేవిక, మనోజ్, రాజు, విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థినీలకు సైకిళ్ళు పంపిణీ

నవతెలంగాణ-కంఠేశ్వర్



రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నిజామాబాద్ నగరంలోని మాణిక్ భవన్ పాఠశాలలో విద్యార్థినిలకు సైకిళ్ళు పంపిణీ చేశారు.. మాణిక్ భవన్, గుండారం, శంకర్ భవన్ ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఆర్చిడ్, సెయిట్ జేవియర్ పాఠశాలల విద్యార్థులకు సైకిళ్ళు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ వైద్యులు ఎం. భూంరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ యుగంలో పోటీతత్వంతో ముందుకు సాగాలన్నారు. కష్ట పడి పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పద్మ శ్రీనివాస్,గౌరీ శంకర్,ఉపాధ్యక్షులు బి.వీరబ్రహ్మం,సభ్యులు గిరీష్ కుమార్, కోటగిరి చంద్రశేఖర్, గంజి రమేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రపు సర్వే



సర్వేకు వచ్చిన అధికారులు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మానిక్ బండారు గ్రామ శివారులో ఏర్పాటు చేసిన వెంచర్‌లోల ఇరిగేషన్ ఆధ్వర్యంలో సర్వే శుక్రవారం నిర్వహించారు. వెంచర్‌లో అక్రమంగా బఫర్ జోన్, దేవాలయ భూముల, కాల్వలు కబ్జా చేశారని గత కొద్ది రోజులక్రితం స్థానిక కార్పొరేటర్ రాయ్ సింగ్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా బఫర్ జోన్ మాత్రమే నామ మాత్రంగా సర్వే చేశారు. మిగితా కాల్వలు, దేవాలయ భూములను తరువాత సర్వే చేస్తామని తెలిపారు. సర్వే వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఇరిగేషన్ ఏఇ దివ్య భారతి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ షెఫీ, సర్వేయర్ కిషన్ నాయక్, నాయకులు నర్సగౌడ్, ప్రభు, లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-బాల్కొండ

సబ్ స్టేషన్ మరమ్మత్తుల కారణంగా బాల్కొండ, వన్నెల్ బి, చిట్టాపూర్ 33/11 కె.వి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఏఈ కిషన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఈ సందర్భంగా వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

15న సీనియర్ సాఫ్ట్‌బాల్ మహిళల జిల్లా జట్ల ఎంపికలు

నవతెలంగాణ-ఆర్మూర్

ఈనెల 15న జెడ్పిహెచ్ఎస్ బాయ్స్ ఆర్మూర్ క్రీడా మైదానంలో సీనియర్ మహిళల సాఫ్ట్ బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్ లో శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 8:00 గంటలకు జిల్లా కోచ్ లు మౌనిక, నరేష్, అనికేత్ లకు రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు.

అయోడిన్ లోపంపై అవగాహన



మాట్లాడుతున్న ఎంఈవో

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

నిజామాబాద్ రూరల్ పరిధిలో గల గుండారం గ్రామంలోని జెడ్పిహెచ్ఎస్ స్కూల్‌లో ఇన్‌స్టిట్యూట్ అఫ్ గ్లోబల్ డెవలప్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో బడి పిల్లలకు అయోడిన్ లోపం కారణంగా వచ్చే రుగ్మతల గురించి అవగాహనా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో సేవ్లా మాట్లాడుతూ.. చాలా మంది పిల్లల్లో ఇంకా గాయిటార్ వ్యాధి కనబడుతుందని అన్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల కలిగే లాభల గురించి చెప్పారు. పిల్లలలో మంద బుద్ధి, శారీరక పెరుగుదల లోపించడం వంటి విషయల పై అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో ఐజిడి జిల్లా కోఆర్డినేటర్ సమత, అసిస్టెంట్ ప్రొఫెసర్ జిజిహెచ్ డాక్టర్ ఉమరా, డాక్టర్ కవిత, జిహెచ్ఎం అమర్నాథ్, యూపీహెచ్చ్ స్కూల్ హెచ్ఎం సాయిలు, ఐజిడి సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫీస్ట్ బాల్ పోటీలకు ఎంపికైన ఆల్ ఫోర్స్ విద్యార్థులు



జాతీయస్థాయి ఫీస్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని బ్రాహ్మణపల్లి క్రాస్ రోడ్‌లోగల ఆల్‌ఫోర్స్ నరేంద్ర పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పీస్ట్ బాల్ పోటీలకు ఎంపిక అయినట్టు విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ క్రీడాకారులు ఆడే ఆట ఫిస్ట్ బాల్ అని, చాలా సులభకరమైన కానీ, న్యూజిలాండ్, కెనడా లాంటి దేశాలలో ఈ క్రీడకు చాలా ప్రాచుర్యం ఉందని అన్నారు. మనదేశంలో సైతం ఈ క్రీడలను పెంపొందించడానికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పిస్తూ వివిధ పోటీలకు ఎంపిక చేస్తూ వారిలో దాగిన ప్రతిభను వెలికి తీస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పీస్ట్ బాల్ ఛాంపియన్ పోటీల్లో ప్రతిభ కనపరిచి, త్వరలో తమిళనాడులో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం గొప్ప విషయమని అన్నారు.

4 మొబైల్ ఫోన్‌లు రికవరీ.. బాధితులకు అప్పగింత

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించామని రెండవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ యాసిర్ అరాఫత్ శుక్రవారం తెలిపారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులు రెండవ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేశామన్నారు. రికవరీ చేసిన నాలుగు మొబైల్ ఫోన్లను పోలీస్ స్టేషన్ ఆవరణలో బాధితులు సుబ్బని అనిల్ కుమార్, ఠాగూర్ సుభాష్ సింగ్ , వినయ్ కుమార్, దాన్పూర్ సంజీవ్‌కు అప్పజెప్పమన్నారు.

వేతనం, గుడ్ల బిల్లులను విడుదల చేయాలి

- తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు)
- ఎన్నికల హామీ ప్రకారం రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్
- 16, 17 తేదీల్లో మధ్యాహ్న భోజనం బంద్
- కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ప్రకటించిన రూ.10వేలు వెంటనే అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 16, 17 తేదీల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) నాయకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గల జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ నాయకులు మాట్లాడుతూ..పెండింగ్లో ఉన్న గుడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. లేకుంటే పిల్లలకు గుడ్లు పెట్టడం బంద్ పెడతామని తెలిపారు. ధరలకనుగుణంగా పిల్లలికిచ్చే మెనూ చార్జీలు పెంచాలని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేల వేతనం అమలు చేయాలని, ప్రతి స్కూల్‌కు గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని, అవసరమైన గ్యాస్ సరఫరా చెయ్యాలని, గుర్తింపు కార్డులు, యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయ పాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వరాదు. ప్రమాద బీమా, పిఎఫ్. ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అన్నారు. షరతులు లేకుండా బ్యాంక్ ద్వారా రుణాలు ఇవ్వాలని, పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్ మెంట్ సిస్టమ్ (పిఎఫ్ఎంఎస్) ద్వారా బిల్లులు. జీతాలు చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) సాయవ్వ, లింగవ్వ, నాగమణి, లక్ష్మి, లత, రజియా బేగం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

రాజీపడితేనే సమస్య పరిష్కారం

జాతీయ లోక్ అదాలత్‌పై ప్రధాన కూడళ్ల వద్ద మైక్‌లతో ప్రచారం



చౌరస్తాలో ఏర్పాటు చేసిన ప్రచారబోర్డు, మైక్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ గురించి నిజామాబాద్ ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేకంగా మైక్‌లను అమర్చి జిల్లా ప్రజలకు సమాచారం చేరవేస్తున్నారు. భార్యాభర్తల మధ్య తగాదాల కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ఆస్తి తగాదాల కేసులు, యాక్సిడెంట్ కేసులు, ఎటువంటి కేసులనైనా జాతీయ లోక అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని వివరిస్తున్నారు. రాజీ మార్గమే... రాజా మార్గం అంటూ చెబుతూ ప్రజలకు తెలిసేలా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ప్రధాన కూడళ్ల వద్ద సమాచారం తెలిపే బోర్డులను, మైక్‌లను అమర్చారు.

తప్పిదాలు లేకుండా రిజిస్టర్లన్నీ పూర్తిచేయాలి

- జిల్లా ఇంటర్ విద్య అధికారి
- ఆల్ఫోర్స్ కళాశాల తనిఖీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్ బోర్డు రూపొందించిన నియమ నిబంధనల ప్రకారం ఫైళ్ళ నిర్వహణ, కళాశాల నిర్వహణ జరగాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమాలపూడి రవికుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని తరగతి గదులను, పరిసరాలను పరిశీలించారు. కళాశాల కార్యాలయం సిబ్బంది కళాశాల యాజమాన్యంతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు ప్రతి కార్యాలయ రిజిస్టర్లన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలు దొర్లకుండా చూడాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా ప్రతి అంశంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థుల డేటాను సరిచేసుకునేందుకు సబ్జెక్టులు మార్చుకునేందుకు, ఫోటో సంతకం తప్పిదం సరిదిద్దుకోవడానికి ఇంటర్ బోర్డు మరో అవకాశం ఇచ్చిందని, డేటాను సారి చేసి కంప్యూటర్లలో నిక్షిప్తం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు నిబంధనలను అతిక్రమించిన ఏ కళాశాలపై అయిన కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కళాశాల ఆవరణతోపాటు, తరగతి గదులను, ప్రయోగశాలలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం ఫైళ్ళ నిర్వహణ, పాలనాపరమైన అనుమతులు, పరీక్ష ఫీజుల వసూలు, ఇతర అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. సమావేశంలో ప్రిన్సిపల్, సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఐఈవో రవికుమార్

ఎత్తిపోతల పనులు పూర్తి చేయించండి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే వినతి

నవతెలంగాణ-ఆర్మూర్

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వద్ద శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మంత్రికి వినతి పత్రం అందజేశారు. నికాల్పూర్, మారంపల్లి, వన్నెల్ (కె), తల్వేద ఎత్తిపోతల కు మోటార్ల మరమత్తులు చేయాలని కోరారు, కాళేశ్వరం ప్యాకేజ్ లో భాగంగా పైప్ లైన్స్ వేయాలని, గుత్ప ఎత్తిపోతల పథకం... మునిపల్లి ఎత్తిపోతల పథకం వరకు ఆయకట్టు 2642 ఎకరాలు ఉందని తెలిపారు. ఆర్మూర్ నియోజకవర్గంలో 11 గ్రామాలు 1600 ఎకరాలు, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం 12 గ్రామాలు 1058 ఎకరాలు ఉంటాయని అన్నారు. కాంట్రాక్టర్‌కు కోటి 35 లక్షలు పేమెంట్ చేయగలిగితే పనులు కంప్లీట్ అవుతాయన్నారు. 70శాతం పనులు పూర్తయ్యాయని, మిగతా పనులు పూర్తి చేయాలని కోరారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అతి త్వరలో నిధులు మంజూరు చేసి పనులు అయ్యే విధంగా చూస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

ధర్నాను విజయవంతం చేయండి

- ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి

నవతెలంగాణ-మాక్లూర్

రైతాంగ సమస్యల పరిష్కారం - వ్యవసాయ అనుబంధ రంగాలకు నిధులు కేటాయించాలని ఈనెల 18న నిజామాబాద్ కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా ను విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని కృష్ణ నగర్ గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కేంద్ర ఎంఎస్పి మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని పార్లమెంట్లో తీసుకురావాలని అలాగే విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని జిల్లాలో గల రెండు చెక్కర ఫ్యాక్టరీలను తెరిపించి ప్రభుత్వమే నడిపించాలని, ధరణిలో ఉన్న లోపాలను పరిష్కరించాలని, ఎన్సీఎస్ఎఫ్ సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని బెల్లం కేంద్రంగా మార్చాలని కోరారు. పసుపు పరిశోధన కేంద్రాన్ని ఆర్మూర్లో ఏర్పాటు చేయాలని, వ్యవసాయ అనుబంధ రంగాలైన గొర్రె, మేక పాడి పరిశ్రమ, మత్స్య పరిశ్రమ తదితర రంగాలకు తగిన రుణాలు ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తడకల కృష్ణ గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి డి. బన్నీ, మండల నాయకులు రాపాని గంగాధర్, సిర్రమ్ శంకర్, ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యూ నిజామాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి దేశెట్టి రాధా, డివిజన్ నాయకురాలు గోవా సరోజన, కృష్ణానగర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాట్‌ఫామ్‌పై మరిచిపోయిన బ్యాగు అప్పగింత

- నగదు, బంగారం, సెల్ఫోన్ అప్పగించిన రైల్వే పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్‌లో నగదు, బంగారం సెల్‌ఫోన్ గల బ్యాగును ప్లాట్ ఫామ్‌పై మర్చిపోయిన బాధితులకు పిలిపించి అప్పగించినట్లు రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయి రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో రైల్వే స్టేషన్లో రైల్వే పోలీసులు ప్లాట్ ఫామ్‌పై చెక్ చేయగా వారికి ఒక బ్యాగ్ కనిపించింది. అక్కడ ఎవరూ లేనందున ఆ బ్యాగ్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి బ్యాగ్ చెక్ చేశారన్నారు. అందులో ఐదు వందల నోట్లు లక్ష ఎనిమిది వేయిల ఐదు వందల రూపాయలు, ఒకటిన్నర తులాల బంగారు చైన్, అరతులం ఉంగరం, బట్టలు, ఫోన్ ఉందని తెలిపారు. వెంటనే ఆ ఫోన్ ద్వారా అందులో ఉన్న ఎటిఎం కార్డు ద్వారా వారిని కనుక్కొని పిలిపించామన్నారు. మామిడాల నర్సయ్య జగిత్యాల జిల్లా కాగా వారు ముంబై నుండి నిజామాబాద్‌కు శుక్రవారం వచ్చి కార్‌లో వెళ్తూ ఇక్కడ బ్యాగు మరచి పోయినామని తెలిపారు. బ్యాగులో ఉన్న డబ్బులు, బంగారం, చైన్, రింగు అన్ని రీసెప్ట్ తీసుకొని ఫోటో తీసుకొని అప్పజెప్పడం జరిగిందన్నారు. బ్యాగును భద్రం చేసి బాధితులకు అప్పగించేందుకు కృషిచేసిన హెడ్ కానిస్టేబుల్, సీనా నాయక్ కానిస్టేబుల్, ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ పాష లను ప్రత్యేకంగా అభినందించారు.



నగదు, బంగారం బ్యాగ్ అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

గుత్ప నుంచి మునిపల్లి వరకు పెండింగ్ లిఫ్ట్ పనులు త్వరగా పూర్తి చేయించాలి

ఇరిగేషన్ శాఖ మంత్రికి వినతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మునిపల్లి లిఫ్టుకు మాక్లూర్ మండలంలోని గుత్ప నుండి మునిపల్లి లిఫ్ట్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఇరిగేషన్, తెలంగాణ ఆహార పౌరసరఫరా మంత్రికి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వినతి పత్రం సమర్పించినట్లు మాజీ ఎంపీపీ అనంత్‌రెడ్డి తెలిపారు. ఉత్తంకుమార్ రెడ్డి శుక్రవారం పోచంపాడ్‌కు వచ్చిన సందర్భంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని జక్రాన్‌పల్లి మండలంలో ఐదుగ్రామాలకు, ఆర్మూర్ నియోజకవర్గంలో ఐదు గ్రామాలకు కలిపి 23.80 కోట్లతో పనులు ప్రారంభమై కేవలం 80 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు. మిగితా పనులు 6,7 సంవత్సరాల నుండి పనులు పెండింగ్లో ఉన్నాయని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిన్నారెడ్డి కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఈవ్‌టీజింగ్ చేస్తే.. షీ టీంకు సమాచారం ఇవ్వాలి

నవతెలంగాణ-బాల్కొండ



మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించిన, ఈవ్ టీజింగ్ చేసిన షీ టీంకు సమాచారం ఇవ్వాలని సబ్ డివిజన్ షీ టీం కానిస్టేబుళ్ల విగ్నేష్, సుమతి అన్నారు. మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్ గురించి విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన షీ టీంకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈవ్ టీజింగ్‌కు గురయ్యేవారు సమాచారం ఇస్తే రక్షణ కల్పిస్తామన్నారు. షీటీం నెంబర్ 8712659795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూఆర్ కోడ్ ద్వారా షీటీం వారికి ఫిర్యాదు చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-బాల్కొండ

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ పోచంపాడ్ పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బద్దం ప్రవీణ్ రెడ్డి, బాల్కొండ టౌన్ ప్రెసిడెంట్ సాగర్ యాదవ్‌ని ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ అక్రమ అరెస్టుల వల్ల భయపెట్టాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి భయపడేది లేదని బిఆర్ఎస్ పార్టీ నాయకులు తెలిపారు.

సిఎం కప్ విన్నర్‌కు బహుమతులు అందజేత

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మదన్ పల్లి గ్రామంలో నిర్వహించిన సిఎం కప్ పోటీల్లో మాక్లూర్ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు విన్నర్‌గా నిలువగా ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం బహుమతులు అందుకున్నారు. మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిలు ఖో ఖో, కబడ్డిలో మొదటి బహుమతిని, వాలీబాల్‌లో రెండవ బహుమతిని గెలుపొందారు. ట్రైనీ ఐఎఎస్, ఎంపీడీఓ ఇంఛార్జి సంకెత్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు తీసుకున్నారు. విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం ఇవ్వాలి

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రాజీవ్ గాంధీ ఆడిటోరియం అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదిముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆడబిడ్డపెళ్లి భారం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం కింద లక్షనూటపాదహారు రూపాలు అందించడం సంతోషంగా ఉందని అన్నారు కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం సంవత్సరం కాలం గడుస్తున్న మోక్షం కలుగలేదని ఎద్దేవా చేశారు. చెక్కుల జారీలో జాప్యం జరుగుతుందని మిత్తికి తెచ్చిన డబ్బులకు సగం వడ్డీయే అయితే ప్రయోజనం ఉండదని, అప్లై చేసుకున్న రెండు నెలల కాలవ్యవధిలో చెక్కులు విడుదల చేయాలని ప్రభుత్వానికి అసెంబ్లీలో విజ్ఞప్తి చేస్తానన్నారు. అనంతరం సౌత్, నార్త్ జోన్లకు చెందిన 801మంది లబ్దిదారులకు 8,01,92,916 కోట్ల రూపాయల విలువ గల చెక్కులు అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

లిల్లీపుట్ పాఠశాలలోఫ్రూట్స్ డే వేడుకలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఫ్రూట్స్ డే సెలబ్రేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరూ వివిధ రకాల పండ్లను తీసుకొని వచ్చి, వివిధ రకాల టీఎల్ఎం చార్ట్లతో ఎంతగానో అలరించారు. ఒక్కొక్కరు ఒక్కొక్క పండు వేషంలో వచ్చి దాని యొక్క ప్రత్యేకతను తెలిపారు. కార్యక్రమంలో ఫ్రూట్స్ తో వివిధ రకాల ఐటమ్స్ చేసి మన ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయో ప్రతిదాని గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రీప్రైమరి విద్యార్థులకు ఈ విధంగా ప్రతి కార్యక్రమం నిర్వహించడం వల్ల విద్యార్థులకు ప్రతి అంశంపై ఖచ్చితమైన అవగాహన వస్తుందని, ముఖ్యంగా పండ్లు మన ఆరోగ్యానికి ఎంతో మంచివని విద్యార్థులు స్నాక్ ఐటమ్స్ లో భాగంగా ఒక పండును కచ్చితంగా తినాలని పండ్ల యొక్క విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



వివిధ రకాల పండ్ల వేషాధారణలతో చిన్నారులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
శనివారం | డిసెంబర్ 14, 2024 | www.navatelangana.com

కోపరేటివ్ కంప్యూటర్ రాష్ట్ర ర్యాంకర్‌కు సన్మానం

నవతెలంగాణ-తాడ్వాయి

కంప్యూటర్ కోర్సులో రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించిన ఏనుగు సంతోష్‌రెడ్డికి వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం సన్మానం చేసినట్లు చైర్మన్ నల్లవెల్లి కపిల్ రెడ్డి తెలిపారు. సహకార సంఘంలో విధులు నిర్వహిస్తూ తెలంగాణ కోపరేటివ్ యూనియన్ గన్ ఫౌండేషన్ వారు నిర్వహించిన కంప్యూటర్ పరీక్షలో రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించాడని తెలిపారు. ఈ ఫలితాలు ఈనెల 12 విడుదల చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి.సంజీవరెడ్డి, బాబురావు, ఎ.రాజారెడ్డి, పీసు రాజిరెడ్డి, సీఈఓ నర్సింలు, బాలకిషన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సంతోష్‌రెడ్డిని సన్మానిస్తున్న పలువురు

పాఠశాలకు రూ.లక్ష సామగ్రి అందజేత

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని గోపాల్పేట్‌లో గల జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థుల కొరకు ఎన్నారై రూ.లక్ష విలువచేసే సామగ్రిని అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి శుక్రవారం తెలిపారు. జడ్పీహెచ్ఎస్ గోపాల్పేట్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయులు శ్రీనివాస్ స్నేహితుడైన ఎన్నారై సందీప్ కుమార్ విద్యార్థుల కొరకు వాటర్ ప్యూరిఫై తోపాటు సైన్స్ మెటీరియల్, గ్రంథాలయ పుస్తకాలు, మ్యాథ్స్ కిట్, సోషల్, గేమ్స్ మెటీరియల్ అందజేసినట్లు ఆయన తెలిపారు. సందీప్ కుమార్ అందజేసిన వాటర్ ప్యూరిఫైని శుక్రవారం ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్యూరీఫైర్‌ను ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయులు

ఇండ్ల సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- పలు మండలాల్లో సర్వేను పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

తాడ్వాయి : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీవో రంగనాథ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో చేపడుతున్న సర్వేను పరిశీలించారు. ఇండ్లు లేని పేదలు ప్రజా పాలనలో చేసుకున్న దరఖాస్తులను సైతం పరిశీలించి కుటుంబాల సమాచారం పూర్తిగా సేకరించి నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీఓ సవిత రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బాలు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : ఇందిరమ్మ ఇండ్ల ఆన్లైన్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో నరేష్ అన్నారు. మండలంలోని రాంపూర్, జల్దీపల్లి, భవానీపేట్, కొండాపూర్, కంచుమల్, ముంబాజీపేట, ముంబాజీపేట తాండాలలో గత నాలుగు రోజుల నుంచి 1834 మంది ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్న లబ్దిదారుల వివరాలను సర్వే చేసి ఆన్లైన్లో పంచాయతీ కార్యదర్శులు నమోదు చేశారన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ నరేష్ మాట్లాడుతూ.. ఇండ్లు లేని నిరుపేదలకు నివాసం కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన లబ్దిదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలంలో అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు అధికారుల సమన్వయంతో కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. దరఖాస్తుదారుల వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాల న్నారు. ఆయన వెంట ఎంపీఓ మలహరి, ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులున్నారు.


లింగంపేట్ : సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో


జుక్కల్ : మధుర తండాలో సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో

చాటింపు వేసి సర్వే చేపట్టాలి..

జుక్కల్ : ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేస్తున్న నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు తెలిసే విధంగా ముందస్తుగా గ్రామాలలో చాటింపు వేసి సర్వే చేపట్టాలని జుక్కల్ ఎంపిడివో సర్వే అధికారులకు సూచించారు.

శుక్రవారం మండలంలోని మధుర తండాలో సర్వే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రజా పాలనలో స్వీకరించిన దరఖాస్తులతో క్షుణ్ణంగా పరిశీ లించి లబ్దిదారులను గుర్తించి నమోదు చేయాలని ఎంపీ డీవో సూచించారు. మాజీ సర్పంచ్ సంజీవ్ చౌహాన్, జీపి కార్యదర్శి పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ


కూరను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ అన్నారు. శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని 27వ, వార్డులోని ముదాం కాలనీలో గల జిల్లా బాలికల ఉన్నత పాఠశాల, మండల పాఠశాలను మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాలనేదే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్యేయమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని పెట్టాలని ఆదేశించారు. అలాగే మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. ఆకు, కూరగాయలను, గుడ్లు, పప్పు ఉండేటట్టు చూడాలన్నారు. మంచినీటి సౌకర్యం ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్ పిడుగు మమతా సాయిబాబా, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సావిత్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరాహార దీక్ష

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో పేద, మధ్య తరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ ప్రజలకు 'విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు' సాధనకై ధర్మ సమాజ పార్టీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ కామారెడ్డి జిల్లా కన్వీనర్ బోలెశ్వర్, రాష్ట్ర నాయకులు లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎవరి వాటా వారికి ఇవ్వవలసిందేనని, అంతవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజు, గంగరాజు, భూపాల్, రాజు, పర్శరాములు, శేఖర్, కవిన్, లింగం, శివరామకృష్ణ, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు హాజరు కావాలి

- తహసీల్దార్‌కు క్రిస్మస్ గ్రీటింగ్ కార్డు అందజేత

నవతెలంగాణ-ఎడపల్లి

ఈనెల 25న క్రిస్మస్ పండగను పురస్కరించుకుని ఎడపల్లి మండల కేంద్రంలో గల చర్చిలో నిర్వహించనున్న వేడుకలకు హాజరు కావాలని కోరుతూ ఎడపల్లి తహసీల్దార్ గన్వాల్ క్రైస్తవులు క్రిస్మస్ గ్రీటింగ్ కార్డును అందజేశారు. అనంతరం తాసిల్దార్ ధన్వాల్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎడపల్లి మండల అసోసియేషన్ అధ్యక్షులు తిమోతి రాజు, ఎమ్మెస్సీఫారం పాస్టర్ దేవ సహాయం, వడ్డేపల్లి పాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు బేడీలు వేయటం సిగ్గు చేటు

- బీజేపీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం


కామారెడ్డి : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి/బోధన్

లగచర్ల రైతులకు బేడీలు వేసిన రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదులను ఉద్యమకారులుగా, రైతులను ఉగ్రవాదుల్లా చూడడం కాంగ్రెస్ పార్టీకి కొత్తేమీ కాదని అన్నారు. లగచర్ల ఘటనలో అక్రమంగా అరెస్టయి జైల్లో ఉన్న గిరిజన రైతుకు గుండెనొప్పి రావడంతో, తనను ఆసుపత్రికి తీసుకెళ్ళేందుకు ఉగ్రవాదులకు వేసినట్టు బేడీలు వేసి తీసుకెళ్ళడాన్ని బిజెపి తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. రైతులకు బేడీలు వేయటం సిగ్గుచేటని ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పాలనకు, కేసీఆర్ పాలనకు తేడా ఏమీ లేదని.. మారింది పాలకులు మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వేణు, రవీందర్, రాజు, రజినీ కాంత్, రాజేష్, రాజగోపాల్, సాయి, గోవర్ధన్, మహేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం హామీలను అమలు చేయకపోవడంపై నిరసన..

బోధన్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలముందు ఇచ్చిన 6 గ్యారంటీ హామీలను ఇప్పటికీ సక్రమంగా అమలు చేయకపోవడంపై ప్రభుత్వ తీరును ఎండగడుతూ బీజేపీ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పిలుపు మేరకు బోధన్‌లో నిరసన చేపట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా 6 గ్యారెంటీలు అమలుపరచలేనందుకు 6 గ్యారెంటీలు 66 మోసాలకు గానూ నిరసన చేపట్టామన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఇప్పటి వరకు బోధన్ అభివృద్ధికి పాటుపడలేదని విమర్శించారు. ప్రజల సమస్యలను ఏ రోజు కూడా తెలుసుకోవడానికి ప్రయత్నించలేదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డీ మోహన్‌రెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, పట్టణ అధ్యక్షులు కొలిపాక బాలరాజు, ప్రధాన కార్యదర్శి కందికట్ల వాసు, కౌన్సిలర్ వినోద్, గౌతమ్ గౌడ్,జిల్లా ఉపాధ్యక్షులు మేక సంతోష్, జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, సీనియర్ నాయకులు కందికట్ల రామచంద్రర్ తదితరులు పాల్గొన్నారు.

పాలనాధికారి పేరు మాయం

- స.హ.చట్టం బోర్డులో లేని కార్యాలయ పాలనాధికారి పేరు
- గందరగోళానికి గురవుతున్న కార్యాలయానికి వచ్చే ప్రజలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం బోర్డుపై సహాయ సమాచార అధికారిగా సబ్ కలెక్టర్ కార్యాలయ పాలనాధికారి వెంకటేశ్ పేరు లేకపోవడంతో కార్యాలయానికి వస్తున్న ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ఈ బోర్డుపై సమాచార హక్కు చట్టం అప్పీలేట్ అధికారిగా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పేరు, పౌర సమాచార అధికారిగా సబ్ కలెక్టర్ వికాస్ మహతో పేర్లు బోర్డుపై రాయించారు. కానీ సహాయ సమాచార అధికారిగా వ్యవహరించే కార్యాలయ పాలనాధికారి వెంకటేశ్ పేరు మాత్రం బోర్డుపై రాయించలేదు. దాంతో కార్యాలయానికి వచ్చిన వారు పాలనాధికారి ఎవరో తెలియక గందరగోళానికి గురవుతున్నారు. అంతేకాకుండా వివిధ పనులపై వచ్చిన జర్నలిస్టులు, ఉద్యోగులు కూడా పాలనాధికారి పేరు తెలవక ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే సమాచార హక్కు చట్టం బోర్డుపై కార్యాలయ పాలనాధికారి పేరు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన బోర్డుపై కార్యాలయ పాలనాధికారి పేరులేని దృశ్యం

బిల్లులు రాకుంటే ఆందోళనే

- మండల మాజీ సర్పంచులు
- ఎంపీడీవోకు వినతి

నవతెలంగాణ-మద్నూర్

పనుల కోసం అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడితే ప్రభుత్వం చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయకపోవడంతో అప్పు, వడ్డీ కలిసి రెండింతలు అప్పుల పాలయ్యామని.. బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెంటనే పెండింగ్ బిల్లులు వారం రోజుల్లో మంజూరు చేయించాలని లేనియెడల ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని మద్నూర్ ఉమ్మడి మండల మాజీ సర్పంచులు శుక్రవారం మద్నూర్ ఎంపీడీవో రాణి, ఎంపీఓ వెంకట నరసయ్యకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు చేసిన బిల్లులు దాదాపు రెండు సంవత్సరాల కాలంగా పెండింగ్లో ఉన్నాయని అప్పులు చేసి అభివృద్ధి పనులు చేస్తే బిల్లులు రాకపోవడంతో తెచ్చిన అప్పులు వడ్డీతో సహా రెండింతలు అయ్యాయని, తమ సమస్యలు అర్థం చేసుకోవాలని, వెంటనే బిల్లులు మంజూరు చేయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఒక్కొక్క పంచాయతీకి లక్షలాది రూపాయలు బిల్లులు రావాల్సి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మద్నూర్ సురేష్, చిన్నశక్కర్గ గఫర్, శేఖర్‌పూర్ ఎంకే పటేల్, లింబూర్ మధుకర్ పటేల్, దోతి కాశీనాథ్ పటేల్, మోగ సూర్యకాంత్ పటేల్, సుల్తాన్‌పేట్ మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులు, హెచ్‌కేలూర్ గ్రామ మాజీ సర్పంచ్ కుటుంబీకులు, చిన్నతడుగూరు గ్రామ సర్పంచ్ కుటుంబ సభ్యులు, మారేపల్లి గ్రామ సర్పంచ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రాన్ని అందజేస్తున్న మాజీ సర్పంచ్‌లు

మీడియాపై దాడి చేసిన మోహన్ బాబుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-బోధన్

మోహన్ బాబు ఇంటికి కవరేజీ కోసం వెళ్లిన జర్నలిస్టుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మైక్‌తో దాడి చేసిన ప్రముఖ సినీ నటుడు మంచు మోహన్ బాబుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం బోధన్ జర్నలిస్టులు సబ్ కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయాధికారి వెంకటేశ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సినీ నటులు మంచు మోహన్ బాబు కుటుంబంలో జరుగుతున్న వివాదాల నేపథ్యంలో జరుగుతున్న ఘర్షణలను కవరేజ్ చేయడానికి ఆయన ఇంటికి వెళ్లిన టీవీ9 ప్రతినిధి రంజిత్‌పై ఆయన దాడి చేయడం హేయమైన చర్య అని జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఎక్కడైనా సరే న్యూస్ కవరేజ్ చేసే స్వేచ్ఛ ఉందని అన్నారు. ఒక సీనియర్ సినీ నటుడు అయిన మోహన్ బాబు మీడియా ప్రతినిధిపై దాడి చేయడం సమంజసం కాదని అన్నారు. తక్షణమే మోహన్ బాబు జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో భాగంగా వెళ్లిన జర్నలిస్టులపై దాడి చేసిన మోహన్ బాబును తక్షణమే అరెస్టు చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయం అధికారి వెంకటేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు శ్రీనివాస్, లక్ష్మణ్, శ్రీనివాసరావు, సూర్య ప్రకాష్, కృష్ణ, ఉమాకాంత్, విజయ్, సాయిలు, రాజేష్ తదితరులున్నారు.


వినతిపత్రాన్ని అందజేస్తున్న జర్నలిస్టులు

ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- పశువైద్యాధికారి సంతోష్

నవతెలంగాణ-పిట్లం

పాడి రైతులు పశువుల ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని సద్విని యోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి సంతోష్ అన్నారు. శుక్రవారం మండ లంలోని గోడమేగావ్ గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశు గణన అభివృద్ధి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించినట్లు వివరించారు. శిబిరంలో 39 గర్భకోశ వ్యాధులు, 10 కృత్రిమ గర్భధారణ, 7 సాధారణ చికిత్సలు, 33 పశువులకు నట్టల నివారణకు గానూ ఉచిత మందులను సరఫరా చేసినట్లు ఆయన తెలిపారు. కాగా చలికాలంలో పశువులు ఎదకు వస్తాయని కనుక వాటిని సకాలంలో గుర్తించి అందుబాటులో గల గోపాలమిత్ర ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించడం వల్ల మంచి మేలు జాతి దూడలు ప్రసవిస్తాయని తెలిపారు. పాలను సైతం అధికంగా ఇస్తామని ఆయన వివరించారు. అనంతరం రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సూపర్‌వైజర్ బసవరాజ్, గోపాలమిత్ర పండరి రైతులు పాల్గొన్నారు.


పశువులకు చికిత్స నిర్వహిస్తున్న వైద్యాధికారి

తాళం వేసిన ఇంట్లో చోరీ

నవతెలంగాణ-ఎడపల్లి

తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన మండలంలోని తానాకాలన్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోపుల కృష్ణారెడ్డి కుటుంబీకులు ఇంటికి తాళం వేసి వెళ్లారు. అది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో చొరబడ్డారు. బీరువా తాళాలను పగులగొట్టి బీరువాలో ఉన్న ఆరు తులాల వెండి, రూ.50వేల విలువగల పట్టు చీరలను ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితులు ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంజన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

గ్రామానికి దూరంగా పొగాకు ఎండబెట్టాలి

- తహసీల్దార్ శ్రావణ్ కుమార్

నవతెలంగాణ-రెంజల్

గ్రామానికి దూరంగా పొగాకు ఎండబెట్టాలని తహసీల్దార్ శ్రావణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కందకుర్తి గ్రామంలో పొగాకు పండించిన రైతులకు పొగాకు ఎండబెట్టే ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలుష్య నివారణ మండలి ఆదేశాల మేరకు గ్రామంలో పొగాకు బట్టిలను ఏర్పాటు చేయకూడదని ఆయన రైతులకు సూచించారు. ఇటీవల గ్రామంలో సందర్శించి అనారోగ్యంతో బాధపడుతున్న వారి సర్వే నిర్వహించామని, పొగాకుబట్టిల ద్వారా వెలువడే పొగ ద్వారా క్యాన్సర్ వచ్చే సూచనలున్నందున రైతులు సహకరించి తమ పంట భూముల్లోనే పొగాకు బట్టీలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ మీర్జా కలీం బేగ్, మాజీ ఎంపీటీసీ అసాద్ బేగ్, మాజీ ఉపసర్పంచ్ డి.యోగేష్, యూసుఫ్ బిగ్, పూర్ణన్, ఖలీద్ బేగ్, గ్రామ ఇన్చార్జి కార్యదర్శి భాస్కర్, ప్రసాద్, అశ్రు బేగ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్

నేడు రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి మండల విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో గల బోధన్ రూరల్ ఎడపల్లి మండలం, రెంజల్ మండలాలో గల గ్రామాలలో శనివారం రెండు గంటలపాటు విద్యుత్ అంతరాయం ఉండనున్నట్లు ఎడపల్లి మండల విద్యుత్ సబ్ డివిజన్ విద్యుత్‌శాఖ అధికారి ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో బోధన్ రూరల్ పరిధిలో గల చిన్నమావంది, పెగాడపల్లి, ఊట్పల్లి, రెంజల్ మండలంలోని రెంజల్, నీలా, ఎడపల్లి మండల పరిధిలో గల ఎడపల్లి మండల కేంద్రంలో మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

మండల స్థాయి క్రీడల్లో సత్తాచాటిన మామిడిపల్లి పాఠశాల విద్యార్థులు



నవతెలంగాణ-ఆర్మూర్

సీఎం కప్ అర్బన్ మండల స్థాయి పోటీల్లో మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థినులు కబడ్డీ, ఖోఖో పోటీల్లో ప్రథమ బహుమతులు సాధించినట్టు ప్రధానోపాధ్యాయులు డీ.రవీందర్ శుక్రవారం తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాజు చేతుల మీదుగా మెమోంటోస్ అందుకున్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థినులను, పిఈ టి రాజేష్‌ను కౌన్సిలర్లు ఆకుల రాము, మేడిదాల సంగీత రవి గౌడ్, కోన పత్రి కవిత కాశిరాం, వీడిసి బృందం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోతే మోహన్, విట్టల్ ,శోభ, రేణుక ,రాజేశ్వర్, గంగా మోహన్, భాను ప్రకాష్, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ముందు చూయించిన రోడ్డుమార్గం ఇవ్వాల్సిందే

ఆర్‌కేఆర్ అపార్ట్‌మెంట్ వాసుల ఆవేదన

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆర్‌కెఆర్ అపార్ట్‌మెంట్ ప్లాట్లు కొనుగోలు చేసే ముందు చూపించిన రోడ్డు మార్గం ఇవ్వాల్సిందేనని, అపార్ట్మెంట్ ప్లాట్లు కొనుగోలు ముందు దారి ఉందని తమను నమ్మించి మోసం చేసి రోడ్డుపై పడేసారని ఆర్కేఆర్ అపార్ట్మెంట్ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ కలెక్టరేట్ బైపాస్ రోడ్‌లోగల ఆర్‌కెఆర్ అపార్ట్‌మెంట్స్‌కు బైపాస్ రోడ్డు నుండి దారి ఉందని నమ్మించి ప్లాట్‌లను అమ్మి బిల్డర్ మోసం చేశాడని ఆర్కేఆర్ అపార్ట్మెంట్ వాసులు ఆరోపించారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకుడు ఆదెప్రవీణ్ ఆర్కేఆర్ అపార్ట్మెంట్స్ వాసులకు సంఘీభావం తెలుపుతూ మాట్లాడారు. అపార్ట్మెంట్స్ రోడ్డు విషయమై నిజామాబాద్ నగర మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో వెల్మల్ గోపి, ప్రవీణ్, అపార్ట్మెంట్స్‌లోని ప్లాట్స్ యజమానులు, మహిళలు పాల్గొన్నారు.

16న చలో అసెంబ్లీని విజయవంతం చేయండి : పీవైఎల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ లోని అన్ని ప్రభుత్వ శాఖ లలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనల 16న నిర్వహించే చలో అసెంబ్లీ కార్యక్రమం విజయవంతం చేయాలనీ ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్) నాయకులు నిరుద్యోగులకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రతరం అవుతుందన్నారు. నిరుద్యోగుల సమస్య పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని, బిస్వాల్ కమిటీ నివేదిక ప్రకారం అన్ని ప్రభుత్వ శాఖల్లో 1.91 లక్షల ఉద్యోగాలు ఖాళీగానే ఉన్నాయని ప్రభుత్వం ప్రకటన చేసినప్పటికీ నోటిఫికేషన్ ఇవ్వడం లేదని అన్నారు. ప్రభుత్వం ఖాళీ ఉద్యోగాలపై ఒక శ్వేత పత్రం విడుదల చేయాలని తెలిపారు. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌ను రద్దు చేస్తూ అసెంబ్లీ లో తీర్మానం చేయాలన్నారు. చలో అసెంబ్లీకి నిరుద్యోగులు వేలాది గా తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బండమీ నర్సయ్య, జిల్లా సహాయ కార్యదర్శి కంకడి భాస్కర్, పీవైఎల్ జిల్లా కమిటీ సభ్యులు కత్తుల సాయిలు, మీనయ్య, షేక్ షాదుల్లా పాల్గొన్నారు.

బయోలాజికల్ మండల స్థాయి టాలెంట్ టెస్ట్

- విజేతలకు బహుమతుల ప్రదానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల బయోలాజికల్ ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో వేరువేరుగా బయోలోజికల్ టాలెంట్ టెస్ట్ ను నిర్వహించారు. తెలుగు మీడియంలో కోన సముందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.నిఖిల్ ప్రథమ స్థానంలో, కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్. హరీష్ ద్వితీయ స్థానంలో, కమ్మర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.భావన తృతీయ స్థానంలో నిలిచారు. ఇంగ్లీష్ మీడియంలో చౌట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సభా సాజియా ప్రథమ, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంకు చెందిన ఎస్.తనుక్ష ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మండల విద్యాధికారి ఆంధ్రయ్య చేతులమీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మండల బయోలాజికల్ ఫోరం అధ్యక్షులు, ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నరసయ్య, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసుపుల సాయన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం (బీ) మెంట్రాజ్‌పల్లి వెళ్లే రహదారి పక్కన ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్‌హెచ్‌ఓ మొహమ్మద్ షరీఫ్ తెలిపారు. గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం సుమారు 45 నుండి 50 సంవత్సరాల వ్యక్తి డిచ్ పల్లి మండలంలోని ధర్మారం (బీ) నుండి మెంట్రాజ్ పల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన ఉందని తెఇలపారు. మృతుని కుడి చేతి మీద పుట్టుమచ్చ నీతా రమేష్ గవాతే-నాందేడ్- కొండిబా అని పచ్చ బొట్టు ఉందన్నారు. మృతుడిని ఎవరైనా గుర్తు పడితే డిచ్ పల్లి ఎస్ హెచ్ ఓ మోహమ్మద్ షరీఫ్ 8712659852, డిచ్ పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ కే మల్లేష్ 8712659851 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని మార్చురీకి తరలించినట్టు తెలిపారు.

గుర్తుతెలియని శవం లభ్యం



నవతెలంగాణ-భీంగల్‌రూరల్

గుర్తుతెలియని మగ వ్యక్తి శవంభీంగల్ గ్రామ శివారులోని ధర్మరాయి కుంట దగ్గర గల పొలంలో లభ్యమైందని భీంగల్ సీఐ తెలిపారు. వయస్సు సుమారు 50-60 సంవత్సరాల వరకు ఉంటుందని, మృతుని ఎడమ చేయికి ఎ. రాజయ్య అని పచ్చబొట్టు ఉందని అన్నారు. ఎవరికైనా మృతుని వివరాలు తెలిసినట్లయితే వెంటనే భీంగల్ ఎస్‌ఐ సెల్ నెంబర్. 8712659866, భీంగల్ సర్కిల్ సీఐ సెల్ నెంబర్ 8712659865కు సమాచారం అందించాలని తెలిపారు.

మూడు ఇసుక వాహనాల పట్టివేత

నవతెలంగాణ-మోర్తాడ్

జాతీయ రహదారి 63 మోర్తాడ్ బస్టాండ్ సమీపంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రంజిత్ మూడు ఇసుక వాహనాలను పట్టుకున్నట్లు శుక్రవారం తెలిపారు. కమ్మరపల్లి నుండి మోర్తాడ్ వైపు మూడు వాహనాల్లో ఇలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న వాటిని పట్టుకొని, ఒక్కొక్క వాహనానికి 5000 రూపాయలు జరిమానా విధించినట్టు తెలిపారు.

జీవశాస్త్ర ప్రాముఖ్యత పోటీల్లో మంచిప్ప విద్యార్థికి ప్రథమ బహుమతి

నవతెలంగాణ-మోపాల్


మండల కేంద్రంలో బయాలజికల్ సైన్స్ ఫోరం నిర్వహించిన జీవశాస్త్ర ప్రాముఖ్యతపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో మంచిప్ప జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి పి.ప్రతిభ మొదటి స్థానంలో నిలిచారు. మొదటి స్థానంలో నిలవడంతో ఎంఈఓ, మంచిప్ప పాఠశాల ప్రధానోపాధ్యాయులు గేమ్ సింగ్ అమ్మాయిని శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యాయులు బేతాళ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన విపుల్ గౌడ్ ను శుక్రవారం కాంగ్రెస్ భవన్ అటెండర్ ఖాజా పార్టీ కార్యాలయంలో సన్మానించారు. షేక్ ఖాజా గత 49 సంవత్సరాలుగా కాంగ్రెస్ భవన్ అటెండర్ గా పనిచేస్తున్నారు. ఆయన సేవలు అభినందనీయమని విపుల్ గౌడ్ అన్నారు. విపుల్ గౌడ్ ఖాజా కు కృతజ్ఞతలు తెలిపారు.

మల్లారం గండి మలుపు వద్ద పొదలు తొలగింపు



నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

మల్లారం గండిలోని ప్రమాదకరమైన మలుపుల వద్ద చెట్ల పెరగడం వల్ల వాహనదారులకు ప్రమాదకరంగా ఉండడంతో ఎస్సై ఆరిఫ్ గమనించారు. దీంతో ఎస్‌ఐ ఆ పొదలను, కల్వర్టులు కనబడకుండా పెరిగిన చెట్లను ట్రాక్టర్ సహాయంతో తొలగించారు. దీంతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేశారు.

త్వరలో మరికొన్ని సర్వీసులు మీసేవలో

- జిల్లాలోని ప్రజలందరూ నూతన సర్వీసులను వినియోగించుకోవాలి
- ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్తీక్ కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ

కొత్తగా రెవెన్యూ డిపార్ట్మెంట్ నుండి 6 రకాల సర్వీసులు, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నుండి 2 రకాల సర్వీసులు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, సీనియర్ సిటిజెన్ డిపార్ట్మెంట్ నుండి ఒక సర్వీసు అందుబాటులోకి వచ్చిందని, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్తీక్ కుమార్ శుక్రవారం తెలిపారు. గ్యాప్ సర్టిఫికేట్ (రెవిన్యూ), నేమ్ చేంజ్ అఫ్ సిటిజెన్ (రెవిన్యూ), లోకల్ కాండిడేట్ సర్టిఫికెట్ (రెవెన్యూ), మైనారిటీ సర్టిఫికేట్ (రెవిన్యూ, సర్టిఫికేట్ పున్హ జారీ (ఆదాయం, కులం) (రెవిన్యూ), క్రిమీ లేయర్, నాన్-క్రిమీ లేయర్ సర్టిఫికేట్ (రెవిన్యూ), సీనియర్ సిటిజెన్ మెయిటెనెన్స్ మానిటరింగ్ సిస్టం అప్లికేషన్ (డబ్ల్యుసిడి, సిఎస్), వన్యప్రాణులతో చంపబడిన మానవ, పశువులకు పరిహారంకోసం అప్లికేషన్ (ఫారెస్ట్), సామిల్, టింబర్ డిపో ఫ్రెష్, రెన్యువల్‌కు అప్లికేషను (ఫారెస్ట్) తొమ్మిది రకాల సర్వీసులు ఉంటాయన్నారు. ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్తీక్ మాట్లాడుతూ.. గూగుల్ మీట్ ద్వారా జిల్లాలోని మీసేవ కేంద్ర యజమానులకు నూతన సర్వీసులపై అవగాహన కల్పించారు. ఎటువంటి సంబంధిత పత్రాలు నమోదు చేయాలో తెలిపారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ నూతన సర్వీసులను వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే మీ సేవ సెంటర్‌కి వచ్చిన ప్రతి సిటిజన్‌కి నూతన సర్వీసుల గురించి అవగాహన కల్పించాలని మీసేవ ఆపరేటర్లను ఆదేశించారు. ఎటువంటి తప్పులు లేకుండా అప్లికేషన్ చేయాలని, ప్రతి ఒక్క మీసేవ సెంటర్లో సిటిజెన్ చార్టర్, మీసేవ ఫ్లెక్సీస్, స్టేషనరీ తప్పకుండా ఉండాలని అన్నారు. దరఖాస్తుదారునితో దురుసుగా ప్రవర్తించవద్దని తెలిపారు. నిర్ణయించిన రుసుం కంటే ఎక్కువగా తీసుకున్నట్లయితే చర్యలు తీసుకుంటామని మీసేవ కేంద్ర యజమానులను హెచ్చరించారు.

ఆర్పీల ఏడు నెలల జీతాలు ఇవ్వండి

- అధికారుల ఒత్తిడిని, వెట్టి చాకిరీలను అరికట్టాలి
- నిధులు కేటాయించి గౌరవ వేతనాలు ఇచ్చి పిఆర్సిని అమలు చేయాలి
- చలో హైదారబాద్ ఎండీ ఆఫీస్ ఎదుట ధర్నా, అరెస్టు



అరెస్టయిన ఆర్పీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలో పని చేస్తున్న (రిసోర్స్ పర్సన్స్) ఆర్పీలకు ఏడు నెలల పెండింగ్ జీతాలు ఇప్పించాలని, అధికారుల ఒత్తిడి, వెట్టిచాకిరీలను అరికట్టి, ప్రభుత్వ పరంగా నిధులు కేటాయించి గౌరవ వేతనాలు ఇచ్చి పిఆర్సి అమలు చేయాలని, మెప్మా ఆర్పీల సమస్యల పరిష్కరించాలంటూ డిమాండ్ చేస్తూ శుక్రవారం నిజామాబాద్ నుంచి చలో హైదరాబాద్ ఎండి ఆఫీస్ ఎదుట ధర్నా వెళ్లిన మెప్మా ఆర్పిలను నాంపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. స్టేషన్ ఎదుట 36 జిల్లాల నుంచి వచ్చిన మెప్మా ఆర్పి లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మెప్మా అర్పీల రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, రాష్ట్ర.ఉపాధ్యక్షురాలు, జిల్లా అధ్యక్షురాలు స్వర్ణలత మాట్లాడుతూ.. ఆర్పిలకు 20వేల వేతనం ఇవ్వాలని, పిఆర్సిలో భాగం చేయాలని, వివోఏల మాదిరిగా ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని, అధికారుల వేధింపులు, పని ఒత్తిడి మానుకోవాలని, 2024 జూన్ నుండి డిసెంబర్ వరకు రావలసిన ఏడు నెలల పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నెం. 164 ప్రకారం వివెల్ఆర్ స్త్రీనిధి, లోకల్ బాడీ నిధుల నుండి ఆర్పీలకు గౌరవ వేతనాలు ఇవ్వాలనే నిబంధనలను తొలగించి సెర్ప్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వివోఏల మాదిరిగా ప్రభుత్వపరంగా ప్రత్యేక నిధులు కేటాయించి గౌరవ వేతనాలు ఇవ్వాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్తులో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి, కోశాధికారి స్వప్న, ఆర్పీలు జమున, ప్రమీల, సుజాత, హరిత, రాజమణి తదితర ఆర్పీలు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం గుర్తింపునకే సీఎం కప్ పోటీలు

- కమ్మర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య



బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సీఎం కప్ క్రీడా పోటీలను ఏర్పాటు చేసిందని కమ్మర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియంలో మూడు రోజులపాటు నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతుల ప్రధానం కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు, బహుమతులకు ఎస్ఐ అనిల్ రెడ్డి సహకారం అందించారు. సీఎం కప్ మండల కన్వీనర్, ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ మాట్లాడుతూ మూడు రోజులపాటు మండల స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీలకు సహకరించిన ఎస్ఐ అనిల్ రెడ్డికి, వ్యాయామ ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. మండల స్థాయి క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 16 నుండి 21 వరకు జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, పంచాయతీ కార్యదర్శి గంగాజమున, మండల ఫిజికల్ డైరెక్టర్ నాగభూషణం, ప్రధానోపాధ్యాయులు పసుపుల సాయన్న, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు నరేందర్, ఆయా గ్రామాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, యువకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మండల స్థాయి సీఎం కప్పు విజేత జట్లు ఇవే

మండల కేంద్రంలోని గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియంలో మూడు రోజుల పాటు మండల స్థాయిలో జరిగిన సీఎం కప్పు విజేత జట్ల వివరాలను క్రీడల కన్వీనర్, ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, మండల ఫిజికల్ డైరెక్టర్ నాగభూషణం శుక్రవారం తెలిపారు. కబడ్డీ ఓపెన్ మెన్స్ విభాగంలో ఉప్లూర్ ప్రథమ, చౌట్‌పల్లి ద్వితీయ, కమ్మర్‌పల్లి తృతీయ, ఉమెన్స్ ఓపెన్ కబడ్డీ విభాగంలో బషీరాబాద్ ప్రథమ, కమ్మర్‌పల్లి ద్వితీయ, నాగపూర్ తృతీయ బహుమతులు గెలుపొందాయి. ఖోఖో ఓపెన్ మెన్స్ విభాగంలో చౌట్‌పల్లి ప్రథమ, కమ్మర్‌పల్లి ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచింది. ఉమెన్స్ ఓపెన్ విభాగంలో కోనసముందర్ ప్రథమ, ఉప్లూర్ ద్వితీయ, కమ్మర్‌పల్లి తృతీయ బహుమతులు గెలుచుకున్నాయి. వాలీబాల్ జూనియర్ బాయ్స్ విభాగంలో కమ్మర్‌పల్లి ప్రథమ, నాగపూర్ ద్వితీయ, బషీరాబాద్ తృతీయ, జూనియర్ బాలికల విభాగంలో బషీరాబాద్ ప్రథమ, కమ్మర్ పల్లి ద్వితీయ, ఉప్లూర్ తృతీయ స్థానంలో నిలిచి బహుమతులు గెలుపొందాయి. గెలుపొందిన జట్ల క్రీడాకారులను క్రీడల కన్వీనర్, ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, మండల ఫిజికల్ డైరెక్టర్ నాగభూషణం అభినందించారు. ఈనెల 16 నుండి 21 వరకు జిల్లా స్థాయిలో జరిగే సీఎం కప్ క్రీడల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్లు ఆయా క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్తాయని తెలిపారు.

నేడు రైతు, మహిళా సదస్సు

- ఏర్గట్లకు కాంగ్రెస్ నాయకుల రాక

నవతెలంగాణ-ఏర్గట్ల

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలో శనివారం ఏర్పాటు చేయనున్న రైతు, మహిళా సదస్సు ఉంటుందని డీసీసీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సోమ దేవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర సహకార ట్రేడ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వినూత్నంగా సెర్ప్ సీఈవో జన్మదిన వేడుకలు

- ఇరువురి పేదలకు నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూల సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి దివ్య దేవరాజన్ ఐఏఎస్ పుట్టినరోజు వేడుకలను ఐకెపి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుంట గంగాధర్ ఆధ్వర్యంలో స్థానిక మండల సెర్ప్ సిబ్బంది వినూత్నంగా జరుపుకున్నారు. స్థానిక కమ్మర్‌పల్లి ఐకెపి ఎపిఎంగా పని చేస్తున్న కుంట గంగాధర్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సిబ్బంది ఇరువురి పేదలకు 20 కేజీల బియ్యం, పప్పులు, సబ్బులు వంటి నిత్యవసర సరుకుల తోపాటు పండ్లను సైతం అందించి పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కుంట గంగాధర్ మాట్లాడుతూ అనునిత్యం పేదలు మహిళల సంక్షేమం కోసం కృషి చేసే దివ్య దేవరాజన్ బొకేలు, స్వీట్లను తిరస్కరిస్తారని తెలిపారు. ప్రతి పైసా పేదల సంక్షేమానికి ఉపయోగించాలని తమకు చెబుతూ ఉంటారని అన్నారు. దీంతో పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సిసిలు రవికుమార్, అలేఖ్య, పిఓఎలు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- 16,17మధ్యాహ్న భోజనం బంద్



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

నవతెలంగాణ-ఆర్మూర్

మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని ఈ నెల 16,17 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని సిఐటియు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ.. శుక్రవారం మండల విద్యాధికారికి ధర్నా విషయమై వినతిపత్రం అందించారు. ఈనెల 16,17 తేదీల్లో మధ్యాహ్న భోజనం బంద్ చేయనున్నట్టు తెలిపారు. ఈ విషయం హెడ్ మాస్టర్లు గమనించాలని కోరారు. కనీస వేతనం 10 వేలు ఇవ్వాలని, గ్యాస్ సబ్సిడీ అందించాలని, ప్రభుత్వమే సరుకులు అందించాలని, పెండింగ్లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని, కాటన్ దుస్తులు డ్రెస్ కోడ్ కింద అందించాలని డిమాండ్ చేశారు. వీరికి తెలంగాణ రైతు సంఘం నాయకులు పల్లపు వెంకటేష్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుజాత, నర్సుబాయ్, గుండేటి శంకర్, దేవమని, స్వరూప, భూలక్ష్మి, సత్యమ్మ, పద్మ, భవిత, జయ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

- సమగ్ర శిక్ష ఉద్యోగులు మానవహారం



మానవహారంగా ఏర్పడ్డ సమగ్ర శిక్ష ఉద్యోగులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఏళ్లుగా శ్రమ దోపిడికి గురవుతున్న సమగ్ర శిక్ష సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిజామాబాద్ లో ఎన్‌టిఆర్ చౌరస్తాలో మానవ హారం చేస్తూ వినూత్న నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు హనుమకొండలో ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని, టిఎస్ఎస్‌యుఎస్ -రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ మాధవ్, సమగ్ర శిక్షా అధికారిక ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం దీక్షా శిబిరం వరకు ర్యాలీ, అనంతరం ఎన్‌టీఆర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. డిమాండ్లు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రాజు స్పష్టం చేశారు. కార్యక్రమం లో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూపేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, కోశాధికారి ప్రసాద్, పవిత్రన్, రాజు, ప్రకాష్. గంగాధర్, గంగామణి, సుప్రజ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మెకు ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, పిడిఎస్యు జిల్లా ప్రధానకార్యదర్శి కే.గణేష్ సంఘీభావం ప్రకటించారు. ఎస్ఎస్ఎ, కేజీబీవీ లో పనిచేస్తున్న ఉద్యోగులు సిబ్బంది సమస్యలను పరిష్కరించాలన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, ఖాళీ పోస్టులు భర్తీచేయాలని అన్నారు. అవసరమైతే వారితో ప్రత్యక్షంగా ఆందోళనలో పాల్గొంటామనీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు హేమలత, ప్రధాన కార్యదర్శి సుమలత, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో కార్డుతో వైద్యసేవలు

- ఏసిపి రాజా వెంకట్ రెడ్డి
- మెడికవర్డ్ ఫామిలీ కార్డు ఆవిష్కరణ



మెడికవర్డ్ ఫ్యామిలీ కార్డును ఆవిష్కరిస్తున్న ఏసీపీ, ఆస్పత్రి సిబ్బంది

నవతెలంగాణ-కంఠేశ్వర్

వైద్య సేవలో సరికొత్త కార్డుతో అనేక ప్రయోజనాలు అంటూ మెడికల్ హాస్పిటల్ ముందుకు వచ్చింది. అందులో భాగంగానే మెడికవర్ హాస్పిటల్ మెడికవర్డ్ ఫ్యామిలీ కార్డును నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజా వెంకట్ రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కుటుంబ కార్డు నాణ్యమైన ఆరోగ్యాన్ని సామాన్యులకు మరింత చేరువ అవ్వటానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఆర్థిక స్తోమత గురించి చింతించకుండా కుటుంబ సంరక్షణను ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించే దిశగా ఈ ఫామిలీ కార్డు ఒక ముందడుగు అని అన్నారు. అనంతరం మెడికవర్ సెంటర్ హెడ్ స్వామి మాట్లాడుతూ.. విశ్వసనీయ ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తున్న మెడికవర్ హాస్పిటల్స్ ఇప్పుడు మెడికవర్డ్ ఫ్యామిలీ కార్డ్‌తో రోగులతో బంధాన్ని బలోపేతం చేయడానికి తాము సేవ చేసే ప్రతి కుటుంబానికి అత్యాధునిక పరికరాలు, సదుపాయాలతో, అనుభవజ్ఞులైన డాక్టర్స్ సరసమైన ధరలతో ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలను విస్తరించడానికి ఈ మార్గం అని అన్నారు. కార్డ్ గరిష్టంగా నలుగురు డిపెండెంట్‌లను కవర్ చేస్తుందని తెలిపారు. మెడికవర్‌లో ఖర్చు చేసే ప్రతి వెయ్యికి ఒక్కో పాయింట్‌కి రూపాయి చొప్పున రీడీమ్ చేసుకోగలిగే ఫ్యామిలీ రివార్డ్‌లను అందిస్తుందిదని అన్నారు. ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ కార్డ్ వెంటనే వాట్సాప్ ద్వారా జారీ చేస్తామని, అనంతరం ఫిజికల్ కార్డ్‌లు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ హెడ్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పాల్స్ కరస్పాండెంట్‌కు సన్మానం



కరస్పాండెంట్‌ను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పామిడిపల్లి సెయింట్ పాల్స్ హై స్కూల్ కరస్పాండెంట్ ఎనోక్ పాల్ (బబ్లు) అడ్వకేట్ గా ఎన్రోరాల్ అయినందున బెస్ట్ అవైలబుల్ స్కీం విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మూడు నియోజకవర్గాల బెస్ట్ అవైలబుల్ స్కీమ్ విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ఇంచార్జ్ చిట్టి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో ప్రభుత్వ హైస్కూల్ (జేసీ) విద్యార్థుల విజయం

నవతెలంగాణ-బోధన్



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో

తెలంగాణ బయాలజీ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం బోధన్ మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్టులో శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జెసి) విద్యార్థులు శ్రీజ ప్రథమ స్థానంలో, భవిత ద్వితీయ స్థానంలో, లావణ్య, చంద్రశేఖర్ తృతీయ విభాగంలో విజేతలుగా నిలిచారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎంఈఓ నాగయ్య అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు బాలచంద్రం, సీనియర్ ఉపాధ్యాయులు నగేష్‌బాబు, బయాలజీ ఫోరం ఉపాధ్యాయులు విద్యాసాగర్ బీరాము, భాస్కర్, వనిత, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శబరిమలైకు భారీ తగ్గింపుతో ప్రత్యేక బస్సు సౌకర్యం

- ఆర్టీసీ డిపో మేనేజర్

నవతెలంగాణ-కామారెడ్డి

శబరిమలైకు వెళ్లే అయ్యప్ప స్వామి భక్తులకు తెలంగాణ ఆర్టీసీ సంస్థ ప్రత్యేక ఆఫర్లు ప్రవేశపెట్టిందని కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ రీజియన్‌లోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, బాన్సువాడ, కామారెడ్డి డిపోల నుంచి శబరిమలైకి వెళ్లే అయ్యప్ప స్వాములకు ఆర్టీసీ స్పెషల్ ఎయిర్ బస్సులపై భారీ తగ్గింపుతో ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఆమె ప్రకటనలో పేర్కొన్నారు. స్వాములు వంట చేసుకునేందుకు వారితో పాటు వెళ్లే ఇద్దరు వంట మనుషులకు ఫ్రీ సౌకర్యం కల్పించిందని, బస్సులలో సీట్లు ఇవ్వకుండా పది సంవత్సరాలలోపు మణికంఠలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించిందని, ప్రయాణికులు సామాను తీసుకు వెళ్లేందుకు ఒక అటెండ్ సీటును ఉచితంగా కల్పిస్తున్నట్టు తెలిపారు. బుకింగ్ కొరకు కామారెడ్డి డిపో 7382843747, నిజామాబాద్ 9959226022, ఆర్మూర్ 7382843133, బోధన్ 9849500725, బాన్సువాడ 9491105106 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

యాసంగికి పోచారం భరోసా

- నిండుకుండలా పోచారం ప్రాజెక్టు
- 10 వేల ఎకరాల సాగుకు రైతులు సన్నద్ధం
- యాసంగి నాట్లకు రైతులు రెడీ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి రెండు మండలాలకు నీరందించే పోచారం ప్రాజెక్టు నిండుకుండలా కలకలలాడుతోంది. వానాకాలం సమృద్ధిగా పంటలు పండించిన రైతులు ఈ యాసంగి పంటలు సైతం పండించేందుకు నడుం బిగించారు. పోచారం ప్రాజెక్టులో నీరు నిండుకుండలా ఉండటంతో సాగునీటికి ఢోకా లేదని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాగిరెడ్డిపేట్ మండలంలోని పోచారం ప్రాజెక్టు మండలంలోని 27 గ్రామపంచాయతీలకు సాగునీరు అందించే పోచారం నిండుకుండలా కనువిందు చేస్తుంది. నాగిరెడ్డిపేట్ మండలంతో పాటు పక్క మండలమైన ఎల్లారెడ్డికి తాగునీరు అందించే ప్రాజెక్టు జలకలతో కనువిందు చేస్తోంది. నాగిరెడ్డిపేట్ మండలంతో పాటు ఎల్లారెడ్డి మండలం కలిపి వానకాలం 18 ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. 13 కాలువల ద్వారా పంటలకు నీరందిస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 1.820 టీఎంసీలు (14.64 ఎంసిఎఫ్‌టి) ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి వానాకాలం పంటలకు సమృద్ధిగా నీరందించింది. యాసంగి పంటలు పండించడానికి ప్రస్తుతం ప్రాజెక్టులో 19.8 అడుగుల నీరు నిలువ ఉంది. యాసంగికి రైతులు 10 వేల ఎకరాలలో పంట సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ప్రాజెక్టులో బుధవారం నాటికి 19.8 అడుగుల నీరు నిలువ ఉందని ప్రాజెక్టు డిఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. పోచారం ప్రాజెక్టు ద్వారా ఏ జోన్ రైతులకు నీరందించనున్నట్లు ప్రాజెక్టు డిఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. చెరువులు, కుంటలు నిండుగా ఉన్నందున సమృద్ధిగా పంటలు పండుతాయని ఆయన పేర్కొన్నారు. యాసంగి పంటలు పండించడానికి రైతులు నారుమడులు సిద్ధం చేశారు.



పోచారం ప్రాజెక్టు (ఫైల్)



ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో సాగుచేసిన వరినారు

త్రైబందీ సమావేశం ఏర్పాటు చేస్తాం

పోచారం ప్రాజెక్టు నీటిని యాసంగి పంటల కోసం విడుదల చేయడానికి డిసెంబర్ చివరి వారంలో త్రైబంది సమావేశం నిర్వహిస్తాం. జనవరి మొదటి వారంలో నీటిని విడుదల చేయడానికి ప్రణాళికలు ఏర్పాటు చేస్తున్నాం.

- డిఈఈ వెంకటేశ్వర్లు

సమాచారాన్ని పక్కాగా సేకరించాలి



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-దోమకొండ(మాచారెడ్డి)

ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో అర్హుల సమాచారాన్ని పక్కాగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మాచారెడ్డి మండలంలోని ఘన్‌పూర్, మాచారెడ్డి గ్రామాలలో నిర్వహిస్తున్న సర్వే పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల పూర్తి వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఇండ్ల నిర్మాణానికి అనువైన భూమి ఉందో లేదో తెలుసుకోవాలని అన్నారు. సర్వేకు ఒకరోజు ముందు గ్రామంలో టామ్‌టామ్ చేయాలని తెలిపారు. సర్వే సమయంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు హాజరయ్యే విధంగా చూడాలని సూచించారు. లబ్ధిదారుల వివరాలు యాప్‌లో పొందుపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్ రావు, ఎంపీడీఓ గోపిబాబు, ఎంపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని తాండూర్, ఆత్మకూర్, బొల్లారం, జానకంపల్లి గ్రామాలకు శనివారం విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు లైన్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు రెండు గంటల పాటు అంతరాయం ఏర్పడనున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ టవర్ల ఏర్పాటుపై అంతరాయం ఏర్పడనున్నట్టు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

భౌతికశాస్త్రంలో విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

- జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థినులు

నవతెలంగాణ-రెంజల్



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన భౌతిక శాస్త్ర ప్రతిభ పరీక్ష నిర్వహించగా, ఆరుగురు విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులు తెలిపారు. ఈ పరీక్షల్లో రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రథమ ర్యాంకు సాధించారు. నీలా జిల్లా పరిషత్ పాఠశాలలో ఒకరు, కోనేపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థిని ద్వితీయ ర్యాంకులు సాధించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జీవశాస్త్రం ఫోరం అధ్యక్షులు శేఖర్, పీఆర్టీయు మండల అధ్యక్ష కార్యదర్శులు టి.సోమలింగం గౌడ్, కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు భూమయప్ప, నాందేవ్, సాయన్న, చంద్రకళ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ నియోజకవర్గం నాయకులు అరవింద్‌కు సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని పెద్దతడగూర్ గ్రామంలో గురువారం రాత్రి మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించగా.. ఈ కార్యక్రమానికి హాజరైన జుక్కల్ నియోజకవర్గం ఎస్సీ సెల్ నాయకులు అరవింద్‌ను అయ్యప్ప స్వామి కొండ రాజు ఆయనకు ఘనంగా సన్మానించి గీత పుస్తకాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కొండ గంగాధర్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

జీవశాస్త్రం ప్రతిభా పరీక్ష ప్రశ్న పత్రం విడుదల

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు, ఆదర్శ, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలకు నిర్వహించిన ప్రతి పరీక్ష ప్రశ్నాపత్రాన్ని మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులు శుక్రవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జీవశాస్త్రం ఫోరం జిల్లా అధ్యక్షులు శేఖర్, పీఆర్టీయు మండల అధ్యక్ష కార్యదర్శులు సోమలింగం గౌడ్, కిషోర్‌కుమార్, భూమయ్యప్ప, సాయన్న, శేఖర్, రవీందర్, చంద్రకళ, మైనారిటీ రెసిడెన్షియల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామారెడ్డి




ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ గత కొద్ది రోజుల క్రితం మృతి చెందగా.. బాధిత కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుపగా వెంటనే స్పందించి నారెడ్డి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు నారెడ్డి మోహన్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.2000 ఆర్థిక సహాయాన్ని శుక్రవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహమ్మద్ అనీఫ్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేందర్ సింగ్, మాజీ ఉపసర్పంచ్ ఖలీల్, అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా యూనివర్సిటీ ఆర్చరీ జాతీయస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నవతెలంగాణ-దోమకొండ



మండల కేంద్రంలోని గడికోట ట్రస్ట్‌కు చెందిన ఆర్చరీ విద్యార్థినీలు ఆల్‌ఇండియా యూనివర్సిటీ ఆర్చరీ నేషనల్ పోటీలకు కదిరే సింధూజ, నిఖిత, భవానీ ఎంపికైనట్లు కోచ్ ప్రతాప్ దాస్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24 నుంచి 27 వరకు భువనేశ్వర్‌లో జరిగే జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో సింధుజ, నిఖిత, భవానీ తెలంగాణ యూనివర్సిటీ తరుపున పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు ముగ్గురు క్రీడాకారినిలు భువనేశ్వర్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. నేషనల్‌కు జాతీయ స్థాయిలో ఎంపికైన వీరు ముగ్గురి క్రీడాకారులను ఆర్చరీ అసోసియేషన్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ కామినేని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్చరీ జిల్లా అధ్యక్షులు తీర్మాల్‌గౌడ్, సంజీవరెడ్డి, సెక్రటరీలు నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి, గంగాధర్ మండల అధికారులు అభినందించారు.

గౌరవ వేతనం చెల్లించాలి

- కోడి గుడ్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలి
- కలెక్టర్‌కు, డీఈవోకు మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

నవతెలంగాణ-కామారెడ్డి


తమకు రావాల్సిన గౌరవ వేతనం, గుడ్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పదివేల గౌరవ వేతనం ఇవ్వాలని కోరుతూ శుక్రవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్‌కు, జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రాన్ని మధ్యాహ్న భోజన కార్మికులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఏడు నెలల నుంచి రాష్ట్రవ్యాప్తంగా తమకు రావాల్సిన గౌరవ వేతనం, విద్యార్థులకు ఇచ్చే మెనూచార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి వంటచేసి పెడుతున్నామన్నారు. అప్పులు తీర్చలేక వడ్డీలు కట్టలేక ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. రాగిజావ పోయాలని ప్రభుత్వం అంటుందని, బిల్లులు రాకపోయినా పిల్లలకు వండి పెట్టాలని ప్రభుత్వ అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. గతంలో చేసిన వాటికి బిల్లులు లేవని, బిల్లులు విడుదల చేయకుండా తమను వంట చేసి పెట్టాలనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని పెండింగ్ బిల్లులు పూర్తిగా చెల్లించాలన్నారు. పెరిగిన వేతనం కొన్ని జిల్లాల్లో, కొన్ని మండలాల్లో మాత్రమే ఇచ్చారని, అది కూడా నెల నెల సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ఒకపక్క ధరలు ఆకాశాన్నంటుతున్న పెరిగిన ధరలకు అనుగుణంగా పిల్లలకు ఇచ్చే మినీ చార్జీలు పెంచడం లేదన్నారు. కార్మికుల జీతాలు పెరగకపోగా ఉన్న జీతాలు కూడా నెల నెల పెండింగ్‌లో ఉండడంతో తాము ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్ పాత మేనుకే సరిపోవడం లేదని, పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేసి తమ అకౌంట్‌లో జమ చేయాలన్నారు. వారానికి మూడు గుడ్లు పెట్టాలని, రాగిజావ పోయాలని ఒత్తిడి చేస్తున్నారని, గుడ్డుకు కేటాయించిన బడ్జెట్ రెండు గుడ్లకే సరిపోదని, మూడు గుడ్లు ఎలా పెట్టాలని ప్రశ్నించారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, లేదా అంగన్వాడీ సెంటర్ సప్లై చేసే విధంగా మధ్యాహ్నం భోజన కార్మికులకు సప్లై చేయాలన్నారు. రాగిజావ ఖర్చులకు డబ్బులు ఇవ్వాలన్నారు. కార్మికులకు అదనపు పనికి అదనం వేతనం ఇవ్వాలన్నారు.

రాష్ట్రమంతటా గృహలక్ష్మి పథకం పేరుతో సిలిండర్ రూ.500 ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించి అమలుకు శ్రీకారం చుట్టిందని, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు అవసరమైన గ్యాస్‌ను సబ్సిడీకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు పదివేలు అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. వెంటనే పెండింగ్లో ఉన్న గుడ్ల బిల్లులు చెల్లించాలని, లేనియెడల జనవరి ఒకటి నుంచి పిల్లలకు గుడ్లు పెట్టడం బంద్ చేస్తామన్నారు. తమకు ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని ప్రమాద బీమా, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. తమకు పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా బిల్లుల వేతనాలు చెల్లించాలన్నారు.

ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

- నేడు భోగేశ్వర ఆలయం నుంచి పొతంగల్ బుగ్గ రామేశ్వర ఆలయం వరకు పాదయాత్ర
- మాజీ ఎంపీటీసీ తూర్పు రాజులు

నవతెలంగాణ-గాంధారి



బడుగు, బలహీన వర్గాల నేత ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరుతూ గాంధారి మండల కేంద్రంలోని భోగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భోగేశ్వర ఆలయం నుండి పెద్దపోతంగల్ గ్రామంలోని బుగ్గ రామేశ్వర ఆలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాదయాత్రలో మండలంలోని అన్ని గ్రామాల, అన్ని తాండాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మదన్ మోహన్‌కు రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో స్థానం కల్పించాలని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

'హక్కుల సాధన కోసం పోరాడుదాం'

నవతెలంగాణ-మద్నూర్

ఈనెల 16న బిచ్కుంద మండల కేంద్రంలోని బండయప్ప ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే మున్నూరు కాపుల మహాసభకు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మున్నూరు కాపుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మద్నూర్ మండలంలోని పెద్దశక్కర్గ, హెచ్ కేలూర్, పెద్దతడుగూర్, లచ్చన్, డోంగ్లి, కుర్లా, అంతాపూర్ తదితర గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా పర్యటించి మున్నూరు కాపులకు అవగాహన కల్పించారు. రాబోయే కాలంలో మున్నూరు కాపులకు రిజర్వేషన్లు పెంచుకునేందుకు మున్నూరు కాపుల హక్కుల సాధన కోసం ఐక్యమత్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. ఇటీవల కామారెడ్డి జిల్లా మున్నూరు కాపు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్టు తెలిపారు. ఈ నూతన కమిటీని ఆహ్వానించి వారికి సన్మాన కార్యక్రమం చేపట్టేందుకు మహాసభ ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు డాక్టర్ బండివార్ విజయ్, పాకల్‌వార్ విజయ్, మున్నూరు శంకర్రావు, ఎస్.గంగారార్, జి.సాహెబ్‌రావు, జుక్కల్ మండల నాయకుడు వినోద్, బిచ్కుంద మండల నాయకులు అరవింద్, రాజు, శ్రీనివాస్, సోపాన్రావు, నిజాంసాగర్ మండల నాయకులు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- ఎఫ్‌ఆర్‌వో హేమచందన

నవతెలంగాణ-గాంధారి

ప్రతి విద్యార్థి తన పుట్టిన రోజున మొక్కను నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఎఫ్‌ఆర్‌వో హేమచందన అన్నారు. శుక్రవారం వనదర్శిని కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను గాంధారి పరిధిలోని అటవీ ప్రదేశంలోకి తీసుకెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌వో హేమచందన మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు పర్యావరణం ప్రాధాన్యత, అడవులను కాపాడాల్సిన ఆవశ్యకతను క్షేత్రస్థాయిలో పరిచయం చేయాలన్న సంకల్పంతో తెలంగాణ అటవీశాఖ వనదర్శిని కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లి అక్కడి వివిధ రకాల చెట్లు, ఔషధ మొక్కలను పిల్లలకు అటవీ అధికారులు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గాంధారి, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరగౌడ్, ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, సాయిలు, శ్రీనివాస్, మన్సూర్, శరణ్య శంకర్ గౌడ్, చిరంజీవి, మల్లేష్, విద్యార్థులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.



వనదర్శిని కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

జనవరి 27న 'వేల డప్పులు.. లక్షల గొంతుకలు'

- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- ఎంఎస్పీ జిల్లా ఇంచార్జి వెంకట స్వామి

నవతెలంగాణ-బోధన్

ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరుతూ హైదారాబాద్ దద్దరిల్లెలా జనవరి 27న 'వేల డప్పులు, లక్షల గొంతుకల' కార్యక్రమం చేపడుతున్న సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా ఇంచార్జి వెంకట స్వామి మాదిగ కోరారు. శుక్రవారం మండలంలోని కొప్పర్గ గ్రామంలో మాదిగ సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఆధారంగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను తెలంగాణ రాష్ట్రంలో వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిగల జనాభా నిష్పత్తి ప్రకారం మాదిగలకు వాటా దక్కేలా రిజర్వేషన్ల వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలయ్యే వరకు ఎలాంటి నియామకాలు గాని, నూతనంగా నోటిఫికేషన్లు గానీ ఇవ్వరాదని, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను తెలంగాణ రాష్ట్రంలో వెంటనే అమలు చేయాలని కోరారు. లేనియెడల అదే డప్పులతో వర్గీకరణ వ్యతిరేకశక్తుల చావు డప్పుగా ర్యాలీ తీస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లసింగారీ భూమయ్య, ఎమ్మార్పీఎస్ బోధన్ మండల ఇంచార్జ్ గోనెవార్ మారుతి, కో ఇన్చార్జి తాడెం అబ్బయ్య, ఎంఎస్పి నాయకులు జాదవ్ ఫకిర నాయక్, తేడ్గోళ్ల విజయ్ కుమార్, రంజిత్, గంగాధర్, విజయ్, అవినాష్, వీరేశ్, సాయిలు, లక్ష్మి మోగులాబాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటస్వామి

ఉత్సవాలకు ముస్తాబవుతున్న శబరిమాత ఆలయం

నవతెలంగాణ-తాడ్వాయి

ఈనెల 15,16,17 తేదీల్లో జరిగే శబరిమాత ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రంగురంగుల విద్యుత్ కాంతులతో, రకరకాల పూల తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. ఉత్సవాలకు ముంబాయి, పూణే, మహారాష్ట్ర, ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి ప్రజలు వస్తారని, వారి కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు భజన పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు వినిపిస్తారని వివరించారు.

పంటలు పరిశీలన

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని పెద్దతడ్గూర్ గ్రామంలో యాసంగిలో సాగు చేస్తున్న, శనగ, మినుము, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, వరి, కంది పంటలను మండల వ్యవసాయ అధికారి రాజు, ఏఈఓ అనిల్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు తగు సస్యరక్షణ చర్యలను సూచించారు. ముఖ్యంగా శనగ పంటలో ఎండు తెగులు నివారణకు కాపర్ అక్సి క్లోరైడ్ 3 గ్రాము, లేదా టేబుకొనజోల్ 1 మిల్లీలీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే శనగలో తొలి దశలో రబ్బరు పురుగు గమనిస్తే నోవాల్యురాన్ 2మిల్లీమీటర్లు లేదా క్వినల్ఫస్ మందుని లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అనిల్ రైతులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

నవతెలంగాణ-తాడ్వాయి

వైద్యులు సమయపాలన పాటించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవి రెడ్డి జలంధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు ఎర్రపాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. నిత్యం రోగులకు అవసరమైన వైద్యం అందించాలని సూచించారు. నూతనంగా వచ్చి ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఖాసీంతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు తదితరులున్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను బైడి సురేష్, తండ్రి పేరు సుదర్శన్, గ్రామం పురానిపేట్ మం:భీంగల్, జిల్లా: నిజామాబాద్. నా సొంత పని నిమిత్తం నేను పురానిపేట్ గ్రామం నుంచి భీంగల్ వెళ్తుండగా మార్గమధ్యలో నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం.J5089265 పోయినది. కావున ఎవరికైనా దొరికినచో ఈ సెల్ నెం.9640801075కు ఫోన్ చేసి తెలపగలరు.